తెలుగు దినపత్రిక

సాక్షర

చదువు..సమీక్షించు

RNI NO.APTEL/2011/42149



కాంగ్రెస్ పార్టీ కండువా కేవలం ఒక వస్త్రం మాత్రమే కాదు.. మన బాధ్యతకు ప్రతీక

(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర) "కాంగ్రెస్ పార్టీ కండువా కేవలం ఒక వస్త్రం మాత్రమే కాదని, అది మన పార్టీ గుర్తింపుకు, సిద్ధాంతాలకు, విలువలకు, మన బాధ్యతకు ప్రతీక అని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ అన్నారు...

9వ పేజీ



సింగరేణి మనుగడను కాపాడాలి..

(రెబ్బెన,సాక్షర) సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటియుసీ)సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు గోలేటి బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం గోలేటిలోని బెల్లంపల్లి ఏరియా జిఎం కార్యాలయం ముందు రెండు రోజుల(18,19)రిలే నిరాహార దీక్షలను ఏఐటియూసి నాయకులు ప్రారంభించారు.కార్యక్రమానికి గో...

9వ పేజీ

ఆదిలాబాద్ | సంపుటి : 16 సంచిక : 285 గురువారం, నవంబర్ 19, 2026 ఎడిటర్: ఎ. లింగన్న | పేజీలు : 10 రూ. 2.00

30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ



(హైదరాబాద్, సాక్షర): తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ నగరానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం దాదాపు రూ.18 వేల కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేసింది. రోడ్లు, తాగునీటి సరఫరా, విద్యుత్, ఘన వ్యర్థాల నిర్వహణ వంటి కీలక వసతులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ నిధులను వినియోగించనుంది. ఇప్పటికే ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. డిసెంబర్ 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న ఇన్వెస్ట్ గ్లోబల్ సమ్మిట్ 2026లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించే అవకాశం ఉంది.భారత్ ఫ్యూచర్ సిటీని సుమారు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 'వర్క్, లివ్, లెర్న్, ప్లే' (పని, నివాసం, విద్య, వినోదం) అనే భావనతో ఈ భారత్ ఫ్యూచర్ సిటీని రూపొందించనున్నారు. అంటే ఉద్యోగాలు, నివాసాలు, విద్యాసంస్థలు, వినోద సదుపాయాలు అన్నీ ఒకే ప్రాంతంలో అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించారు. ఈ నగరంలో మొత్తం 11 రంగాలకు ప్రత్యేకంగా స్థలాలు కేటాయించనున్నారు. లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఎంటర్‌టైన్‌మెంట్, మిక్స్‌డ్ యూజ్, స్పోర్ట్స్ హబ్, నివాస ప్రాంతాలు, ఫర్నిచర్ పార్క్, ఎలక్ట్రిక్ వాహనాలు-ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, విద్యా రంగాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ రంగాల ద్వారా పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.ఫ్యూచర్ సిటీలో పరిశ్రమలు, సాంకేతిక రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. లైఫ్ సైన్సెస్ రంగానికి 4 వేల ఎకరాలకు పైగా కేటాయించనున్నారు. ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాలకు సుమారు 2 వేల ఎకరాలు, ఈవీ సంబంధిత పరిశ్రమలకు మరో 2 వేల ఎకరాల చొప్పున స్థలాలను కేటాయించినట్లు తెలుస్తోంది. డేటా సెంటర్ల ఏర్పాటుకు కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ఈ రంగానికి ప్రత్యేకంగా 357 ఎకరాలు కేటాయించాలని నిర్ణయించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఎలక్ట్రానిక్స్, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ వంటి భవిష్యత్ అవసరాలకు సంబంధించిన పరిశ్రమలను ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేయడం ద్వారా ఫ్యూచర్ సిటీని అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుందిఈ ప్రాజెక్టు కోసం కేటాయించిన భూమిలో గణనీయమైన భాగాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ కోసం సేకరించిన భూముల నుంచి తీసుకున్నట్లు సమాచారం. ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి అవసరమైన ప్రాథమిక మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం సుమారు రూ.

మిగతా 3 లో



ఎన్నిక కోసం రిట్

పేజీ 4



మళ్లీ ఏం ఎత్తుకుపోతారోనని ప్రజల్లో భయం!

పేజీ 3



ఎన్నికలకు దూరంగా ఆ ఐదుగురు

పేజీ 4



కల్వకుంట్ల కుటుంబ కథా చిత్రమ్

పేజీ 4

డిసెంబరు 22 వరకు ఓటరు నమోదు పొడిగింపు



తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు సంబంధించి భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఓటర్ల వివరాల నమోదు, ధ్రువీకరణకు మరింత సమయం కల్పిస్తూ గడువును మరోసారి పొడిగించింది. తొలుత డిసెంబర్ 10వ తేదీతో ముగియాల్సిన ప్రక్రియను తాజాగా డిసెంబర్ 22వ తేదీ వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని అర్హులకు తమ ఓటు హక్కును నమోదు చేసుకునేందుకు మరో అవకాశం లభించనుంది. ఈ విషయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు.

3 లో

నిధులు ఇవ్వకుంటే కురుక్షేత్రమే.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హెచ్చరిక!



మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంత పార్టీ సర్కారుపైనే తీవ్ర అసంతృప్తి స్వరం వినిపిస్తూ కాంగ్రెస్‌లో మరోసారి ప్రకంపనలకు తెరలేపారు. నియోజకవర్గాల అభివృద్ధి, నిధుల మంజూరులో ముఖ్యమంత్రి, మంత్రులు తీవ్రమైన పక్షపాతం చూపుతున్నారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. సమస్యలను పరిష్కరించి రావలసిన వాటా నిధులు కేటాయించకపోతే రాబోయే రోజుల్లో సర్కారుతో 'కురుక్షేత్రం' తప్పదని తేల్చిచెప్పారు. మునుగోడులో బుధవారం జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, పాలన తీరుపై ఘాటు విమర్శలు గుప్పించారు.

2 లో

ఆదాయంలో హైదరాబాద్ వ్యయంలో రంగారెడ్డి



(హైదరాబాద్, సాక్షర): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ, వ్యయాల లెక్కల్లో జిల్లాల మధ్య గణనీయమైన వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలలైన ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు నమోదైన గణాంకాలను పరిశీలిస్తే.. రాష్ట్ర ఆదాయంలో హైదరాబాద్ కీలక వాటా కలిగి ఉండగా.. ప్రభుత్వ ఖర్చుల విషయంలో మాత్రం ఇతర జిల్లాలు ముందున్నాయి.

3 లో

మైక్రోసాఫ్ట్, బ్యాంకులు, విమానాల సేవలు ఒకేసారి ఆగిపోవడంపై అనుమానాలు.. క్లారిటీ ఇచ్చిన అమెరికా



అమెరికాలో ఇటీవలి కాలంలో మైక్రోసాఫ్ట్ సేవలు, విమాన రాకపోకలు, బ్యాంకింగ్ రంగాన్ని కుదిపేసిన సాంకేతిక అంతరాయాల మధ్య ఎలాంటి సంబంధం లేదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో స్పష్టం చేశారు. మనీలా పర్యటనలో ఉన్న ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక అంశాలను వెల్లడించారు. ఈ వరుస వైఫల్యాల వెనుక సైబర్ దాడులు గానీ, శత్రు మూకల కుట్రలు గానీ ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని వివరించారు. మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సేవల అంతరాయానికి, ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) ఎదుర్కొన్న సమస్యకు ఏమాత్రం సంబంధం లేదని రూబియో పేర్కొన్నారు.

పూర్తిగా 2 లో

తమిళనాడు, కర్ణాటక మధ్య కావేరి వార్...



(చెన్నై, సాక్షర): కర్ణాటకలోని కావేరీ నదిపై మేకదాటు దగ్గర భారీ జలాశయం నిర్మించాలని అక్కడి ప్రభుత్వం ప్రతిపాదించింది. బెంగళూరుతో పాటు పరిసర ప్రాంతాల తాగునీటి అవసరాలు తీర్చడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. నీటిని నిల్వ చేయడంతో పాటు విద్యుత్ ఉత్పత్తి చేయాలని కర్ణాటక భావిస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 67 టీఎంసీల నీటిని నిల్వ చేయాలని ప్రతిపాదించింది. తాగునీటి అవసరాలకు 4.75 టీఎంసీలు వినియోగించాలని ప్రణాళికలో పేర్కొంది. సుమారు 400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కూడా లక్ష్యంగా పెట్టుకుంది. అయితే తమిళనాడు ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

పూర్తిగా 2 లో

మరోసారి వేలానికి హైదరాబాద్ భూములు



హైదరాబాద్ మహానగర పరిధిలోని అత్యంత కీలకమైన ప్రాంతాల్లోని స్థలాలను విక్రయించేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) సిద్ధమైంది. ఈ నెల 25, 27 తేదీల్లో నిర్వహించనున్న మెగా ఈ-వేలానికి సంబంధించిన సన్నాహక సమావేశం (ప్రీ-బిడ్ మీటింగ్) రాయదుర్గంలోని టీ-హబ్‌లో విజయవంతంగా ముగిసింది. ఈ సమావేశంలో హెచ్ఎండీఏ ఉన్నతాధికారులతో పాటు వేలం నిర్వహణ సంస్థ ఎంఎస్‌టీసీ, ప్రాజెక్ట్ కన్సల్టెన్సీ కేపీఎంజీ ప్రతినిధులు పాల్గొన్నారు. వేలంలో పాల్గొనడానికి ఆసక్తి చూపిస్తున్న పలువురు డెవలపర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిడ్డర్లకు స్థలాల వివరాలు, నిబంధనలను అధికారులు సమగ్రంగా వివరించారు.హుడా హైట్స్, నియోపొలిస్, మూసాపేట్ ప్రాంతాల్లో ఉన్న ప్లాట్లకు సంబంధించిన భౌగోళిక పరిస్థితులు, రవాణా అనుసంధానం, ఇప్పటికే అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, భవిష్యత్ అభివృద్ధి అవకాశాలపై కేపీఎంజీ ప్రతినిధులు ఒక ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఎంఎస్‌టీసీ అధికారులు ఆన్‌లైన్ వేలం ప్రక్రియలో ఎలా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి, బిడ్లను ఎలా దాఖలు చేయాలనే సాంకేతిక అంశాలను విపులంగా వివరించారు.ఈ సందర్భంగా బిడ్డర్లు లేవనెత్తిన పలు సందేహాలను అధికారులు నివృత్తి చేశారు.

పూర్తిగా 3 లో

కృష్ణా జలాలపై సమరం.. ప్రభుత్వంపై కేటీఆర్ ధ్వజం



(హైదరాబాద్, సాక్షర): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్, టీడీపీ పార్టీలు తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశాయి. చంద్రబాబు పాలమూరును దత్తత తీసుకున్న తర్వాత కూడా జిల్లా మరింత అధోగతి పాలైంది. పాలమూరుకు వలసలు, నల్లగొండకు ఫ్లోరోసిస్ మిగిల్చిన సమైక్య పాలకులు.. కృష్ణానది పక్కనే ఉన్నా 60 ఏళ్ల పాటు తాగునీరు అందించలేకపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో అయన మిడియాతో మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో ఆంధ్ర ముఖ్యమంత్రులు తెలంగాణకు చేసిన ద్రోహం కంటే..

పూర్తిగా 4 లో

సంపాదకీయం

దడ పుట్టిస్తున్న ద్రవ్యోల్బణం



ధరల కట్టడిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం కావడంతో ప్రజల జేబులకు చిల్లులు పడుతున్నాయి. దేశంలో టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) మరోసారి పెరిగింది.అక్టోబరులో వార్షిక ప్రాతిపదికన టోకు ద్రవ్యోల్బణం 12.29 శాతానికి చేరింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల్లో ఈ విషయం వెల్లడైంది.సెప్టెంబరులో నమోదైన 11.39 శాతంతో పోలిస్తే అక్టోబరులో ద్రవ్యోల్బణం మరింత పెరిగింది. సర్వేలో ఆర్థిక నిపుణులు అంచనా వేసిన 12.1 శాతాన్ని కూడా మించింది.ప్రధానంగా ఆహార పదార్థాలు, చమురు ధరలు పెరగడం ఈ పరిణామానికి కారణమైంది. అక్టోబరులో టోకు ఆహార ధరలు 8.58 శాతం పెరిగాయి.అయితే సెప్టెంబరులో ఈ పెరుగుదల 8.66 శాతంగా నమోదైంది. అంటే ఆహార ధరల పెరుగుదల రేటులో స్వల్ప తగ్గుదల కనిపించింది.మరోవైపు తయారీ రంగ ఉత్పత్తుల ధరలు అక్టోబరులో 9.54 శాతం పెరిగాయి.సెప్టెంబరులో ఈ పెరుగుదల 9.76 శాతంగా ఉంది. దీంతో తయారీ ఉత్పత్తుల ధరల పెరుగుదలలోనూ కొంత తగ్గుదల నమోదైంది.ఇంధనం, విద్యుత్ ధరల పెరుగుదల మాత్రం మరింత వేగంగా కొనసాగింది.సెప్టెంబరులో 25.85 శాతంగా ఉన్న ఈ విభాగం ద్రవ్యోల్బణం అక్టోబరులో 32.84 శాతానికి చేరింది.అయితే పెట్రోలియం, సహజ వాయువు ధరల పెరుగుదల మాత్రం గణనీయంగా తగ్గింది.సెప్టెంబరులో 57.32 శాతంగా ఉన్న ఈ ధరల పెరుగుదల అక్టోబరులో 7.80 శాతానికి పరిమితమైంది.మొత్తంగా ఆహార పదార్థాలు, ఇంధనం, చమురు ధరల్లో చోటుచేసుకున్న మార్పులు టోకు ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపాయి.జాతీయ గణాంక కార్యాలయం విడుదల చేసిన వినియోగదారుల ధరల సూచీ గణాంకాల ప్రకారం, దేశంలో 7 శాతానికి మించి ద్రవ్యోల్బణం నమోదైన ఆరు రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఉంది. గత పది నెలలుగా రాష్ట్రంలో ద్రవ్యోల్బణం జాతీయ సగటు కంటే ఎక్కువగా కొనసాగుతోంది. ఇది సామాన్య కుటుంబాల కొనుగోలు శక్తిపై ఒత్తిడి తెస్తోంది.ఈ ఏడాది జనవరిలో తెలంగాణలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.92 శాతంగా ఉండగా, నెలవారీగా పెరుగుతూ అక్టోబర్‌లో 7.26 శాతానికి చేరుకుంది.ఫిబ్రవరిలో 5.02, మార్చిలో 5.83, మేలో 6.15, జూన్‌లో 6.36 శాతంగా నమోదైంది. జూలై, ఆగస్టులో కాస్త తగ్గినప్పటికీ సెప్టెంబర్ నుంచి మళ్లీ పెరుగుదల మొదలైంది. ఇప్పుడు ఏడాది గరిష్ఠ స్థాయికి చేరింది.గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వ్యత్యాసం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. అక్టోబర్‌లో గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 8.05 శాతానికి చేరగా, పట్టణ ప్రాంతాల్లో 6.68 శాతంగా ఉంది. జాతీయ గ్రామీణ సగటు 6.63 శాతంతో పోలిస్తే తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 1.4 శాతం పాయింట్లు అధికం.దీంతో గ్రామీణ కుటుంబాలపై నిత్యావసరాల ధరల భారం మరింత ఎక్కువగా పడుతోంది.ఆహార ధరల పెరుగుదలే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. జాతీయ స్థాయిలో ఆహార ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో 7.74 శాతం ఉండగా అక్టోబర్‌లో 8.94 శాతానికి పెరిగింది. ఉల్లి ధరలు 116 శాతం పైగా పెరగడం, వెల్లుల్లి, అల్లం, నిమ్మకాయలు, బియ్యం వంటి వస్తువుల ధరలు ఎగబాకడం సామాన్యుల ఇంటి బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.అక్టోబర్‌లో రాష్ట్రంలో వర్షపాతం భారీగా తగ్గడం, ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇది కూరగాయలు, పండ్లు, ధాన్యాల ధరలపై మరింత ఒత్తిడి తీసుకురావచ్చు.ధరల పెరుగుదల వల్ల మధ్యతరగతి, నిమ్న మధ్యతరగతి కుటుంబాలు రోజువారీ ఖర్చులను తగ్గించుకోవాల్సి వస్తోంది. కూరగాయలు, పప్పులు, నూనె, పాలు వంటి అవసరాలకు ఎక్కువ ఖర్చు పెట్టాల్సి రావడంతో ఇతర అవసరాలు వెనక్కి పోతున్నాయి.ప్రభుత్వం ధరల నియంత్రణకు చర్యలు చేపట్టినప్పటికీ, సరఫరా గొలుసులోని సమస్యలు, వాతావరణ ప్రభావం కొనసాగితే ముందున్న నెలల్లో కూడా ఒత్తిడి ఉండే అవకాశం ఉంది.మొత్తంగా చూస్తే తెలంగాణలో ద్రవ్యోల్బణం నియంత్రణలోకి రావాలంటే ఆహార ఉత్పత్తి పెంపు, సరఫరా మెరుగుదల, అవసరమైన చోట సబ్సిడీలు లేదా మార్కెట్ జోక్యం అవసరం. సామాన్యులు కూడా ధరలు తక్కువగా ఉన్న సీజనల్ కూరగాయలు, స్థానిక ఉత్పత్తులు వాడటం ద్వారా కొంతవరకు ఖర్చులను అదుపులో ఉంచుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితి సామాన్యుడి జేబుపై నిజంగా భారం పెడుతోంది.ద్రవ్యోల్బణం కట్టడికి వచ్చే ద్రవ్య సమీక్షల్లో రెపోరేటును ఆర్బీఐ పెంచడం ఖాయంగానే కనిపిస్తున్నది. ఇదే జరిగితే నిర్మాణ, ఆటో రంగాలకు పెద్ద దెబ్బేనన్న విశ్లేషణలుంటున్నాయి. ఇప్పటికే ఇండ్ల విక్రయాలు లేక రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. ఈ క్రమంలో వడ్డీరేట్ల పెంపు గృహ రుణాలపై ప్రభావం చూపనున్నది. ఇప్పటికే లోన్లపై ఇండ్లు కొన్నవారికి ఈఎంఐలు భారంగా మారుతాయని, కొనాలనుకుంటున్నవారు తమ నిర్ణయాలను వాయిదా వేసుకోవచ్చని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. అలాగే వాహన, వ్యక్తిగత రుణాలూ ప్రియమవుతాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణ, ఆటో వాటి అనుబంధ రంగాలు మందగమనంలోకి జారుకుంటే.. అది దేశ ఆర్థిక వృద్ధిరేటునే కుంగదీస్తుందని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలే ఎల్ నినో దెబ్బకు అన్ని రంగాలు ఢీలాపడ్డ తరుణంలో ద్రవ్యోల్బణం పేరిట ఆర్బీఐ వడ్డీరేట్లను పెంచితే మరిన్ని రంగాలు నష్టపోతాయని సూచిస్తున్నారు.ఇంధనం, ఆహార ధరల షాక్‌లు రెండూ ఒకేసారి వచ్చినప్పుడు వాటి ప్రభావం మరింత పెద్దదిగా ఉండవచ్చు. అందుకే పరిస్థితుల్ని చక్కదిద్దడానికి ఆర్బీఐ వడ్డీరేట్ల పెంపు అనివార్యంగానే కనిపిస్తున్నది. వచ్చే నెల ద్రవ్య సమీక్షలో రెపోరేటు 50 బేసిస్ పాయింట్లు పెరిగే వీలు లేకపోలేదు.ఎల్ నినో కారణంగా ఏర్పడిన వర్షాభావ పరిస్థితులతో దేశీయ వ్యవసాయ రంగం దెబ్బ తింటున్నది. పంటల సాగు, దిగుబడి రెండూ పడిపోతున్నాయి. ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉండటంతో వినియోగ

మొదటి పేజీ తరువాయి

ఆదాయంలో హైదరాబాద్ వ్యయంలో రంగారెడ్డి

ముఖ్యంగా హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల నుంచి అధిక మొత్తంలో వ్యయం నమోదవుతుండటంతో జిల్లాలవారీగా ఆదాయ, వ్యయాల మధ్య అసమానత స్పష్టమవుతోంది.రెవెన్యూ వ్యయం విషయంలో రంగారెడ్డి జిల్లా రూ.3,428.35 కోట్లతో మొదటి స్థానంలో నిలిచింది. నల్గొండ రూ.2,690.21 కోట్లు, వరంగల్ అర్బన్ రూ.2,408.59 కోట్లు, ఖమ్మం రూ.2,277.98 కోట్లు, నిజామాబాద్ రూ.2,153.36 కోట్ల వ్యయంతో తరువాతి స్థానాల్లో ఉన్నాయి. మరోవైపు ములుగు జిల్లాలో రూ.563.79 కోట్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రూ.467.24 కోట్ల రెవెన్యూ వ్యయం మాత్రమే నమోదైంది. దీంతో జిల్లాల మధ్య ప్రభుత్వ ఖర్చుల పంపిణీలోనూ వ్యత్యాసాలు ఉన్నట్లు వెల్లడవుతోంది.రాష్ట్ర రెవెన్యూ వసూళ్లలో హైదరాబాద్ జిల్లా ఏకంగా రూ.84,746.81 కోట్లతో అగ్రస్థానంలో నిలిచింది. రంగారెడ్డి జిల్లా రూ.18,486.84 కోట్ల ఆదాయంతో రెండో స్థానంలో ఉంది. రాష్ట్ర వాణిజ్య కార్యకలాపాలు, రియల్ ఎస్టేట్ లావాదేవీలు, సేవారంగ సంస్థలు, పారిశ్రామిక కార్యకలాపాలు ఈ రెండు జిల్లాల పరిధిలో ఎక్కువగా కేంద్రీకృతమై ఉండటం ఆదాయంలో ఈ వ్యత్యాసానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. హైదరాబాద్ ఆదాయం రంగారెడ్డి కంటే ఎన్నో రెట్లు అధికంగా ఉండటం రాజధాని ప్రాంత ఆర్థిక ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది.ఇక నల్గొండ జిల్లా రూ.818.82 కోట్ల ఆదాయంతో తరువాతి స్థానంలో ఉండగా.. వికారాబాద్ రూ.669.60 కోట్లు, సంగారెడ్డి రూ.572.30 కోట్లు, మేడ్చల్ రూ.545.83 కోట్ల రెవెన్యూ వసూళ్లు సాధించాయి. ఆదాయంలో చివరి మూడు స్థానాల్లో జయశంకర్ భూపాలపల్లి రూ.103.12 కోట్లు, ములుగు రూ.115.28 కోట్లు, జనగామ రూ.116.06 కోట్లతో ఉన్నాయి.ఈ గణాంకాలు రాష్ట్ర ఆర్థిక కార్యకలాపాలు ప్రధానంగా హైదరాబాద్, రంగారెడ్డి పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉన్న విషయాన్ని సూచిస్తున్నాయి. అయితే ఆదాయ, వ్యయాల గణాంకాలను నేరుగా పోల్చేటప్పుడు జిల్లాల జనాభా, ప్రభుత్వ కార్యాలయాల స్థానం, పథకాల అమలు, వ్యయాల లెక్కింపు విధానం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. . అప్పుడే జిల్లాలవారీగా నిధుల కేటాయింపులు, ప్రభుత్వ ఖర్చులు, ఆదాయ వనరుల మధ్య ఉన్న వాస్తవ వ్యత్యాసాలను అంచనా వేయడానికి వీలవుతుందని అంటున్నారు.

కుల్గాంలో ఎన్‌కౌంటర్

- ద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య హోరాహోరీ కాల్పులు
- లష్కరే కమాండర్ లతీఫ్ భట్ కోసం కొనసాగుతున్న గాలింపు
- సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో లతీఫ్ సహచరుడు హతం
- నవంబర్ 11న సీఆర్పీఎఫ్ జవాన్లపై దాడి కేసులో వీరి ప్రమేయం



జమ్మూకశ్మీర్: జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో మరోసారి కాల్పుల మోత మోగింది. ఉగ్రవాదులకు, భద్రతా బలగాలకు మధ్య బుధవారం ఉదయం ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. జమ్మూకశ్మీర్ పోలీసులు, భద్రతా బలగాల సంయుక్త బృందం ఆపరేషన్ నిర్వహిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ విషయాన్ని కశ్మీర్ జోన్ పోలీసులు 'ఎక్స్' వేదికగా ధ్రువీకరించారు. సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్ నుంచి తప్పించుకున్న లష్కరే తోయిబా కమాండర్ లతీఫ్ భట్ కోసం భద్రతా బలగాలు ముమ్మరంగా గాలిస్తుండగా ఈ తాజా ఘటన జరిగింది. సోమవారం నాటి ఆపరేషన్‌లో లతీఫ్ సహచరుడైన ఉమర్ నిసార్ దార్ హతమయ్యాడు. నవంబర్ 11న కుల్గాంలోని అఖ్రాన్‌లో సీఆర్పీఎఫ్ బలగాలపై జరిగిన దాడిలో లతీఫ్, ఉమర్ ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ దాడిలో ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. దాడికి ముందు రోజు, నవంబర్ 10న వీరిద్దరూ పలు ప్రాంతాల్లో రెక్కీ నిర్వహిస్తున్న దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలో నిక్షిప్తమయ్యాయి. బేకరీలో పనిచేసే ఉమర్, గత ఐదారు నెలలుగా లతీఫ్ భట్‌కు ఆశ్రయం కల్పిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. దాడి అనంతరం ఉమర్, లష్కరే అనుబంధ సంస్థ అయిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టీఆర్ఎఫ్)లో చేరినట్లు అధికారులు వెల్లడించారు. సోమవారం ఉమర్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న భద్రతా బలగాలు, మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది అయిన లతీఫ్ కోసం గాలింపును తీవ్రతరం చేశాయి. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం ఉగ్రవాదులు తారసపడటంతో ఎదురుకాల్పులు ప్రారంభమయ్యాయి. డీజీపీ, ఐజీపీ వంటి ఉన్నతాధికారులు ఈ ఆపరేషన్‌ను నిశితంగా పర్యవేక్షిస్తున్నారు.

నేడు తీవ్ర తుఫానుగా మారనున్న అక్వాన్

- ఆంధ్రప్రదేశ్ తీరం వైపు వేగంగా పయనం
- ఎల్లుండి తీరం దాటే అవకాశం
- కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్ష సూచన
- పలు రాష్ట్రాలపై అక్వాన్ తుపాను ప్రభావం



(విశాఖపట్నం, సాక్షర): బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తుపాను వేగంగా బలపడుతూ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తోంది. ప్రస్తుతం నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న ఈ తుపాను, నేటి(బుధవారం) ఉదయానికి తీవ్ర తుపానుగా మారనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. గురువారానికి ఇది అతి తీవ్ర తుపానుగా బలపడి, నవంబర్ 20వ తేదీ మధ్యాహ్నం ఆంధ్రప్రదేశ్-యానాం తీర ప్రాంతాల మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మంగళవారం నాటి సమాచారం ప్రకారం, ఈ తుపాను చెన్నైకి 590 కి.మీ., మచిలీపట్నానికి 670 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది గంటకు 3 కిలోమీటర్ల వేగంతో నెమ్మదిగా వాయవ్య దిశగా కదులుతోంది. తీరం దాటే సమయంలో గంటకు 120-130 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, గరిష్ఠంగా 145 కిలోమీటర్ల వేగాన్ని కూడా తాకవచ్చని అధికారులు తెలిపారు. నెల్లూరు నుంచి తుని లేదా విశాఖపట్నం సమీప ప్రాంతాల మధ్య తీరం దాటే అవకాశం ఉంది. తుపాను ప్రభావంతో బుధవారం నుంచి కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, నవంబర్ 19, 20 తేదీల్లో కొన్ని చోట్ల 21 సెం.మీ.కి పైగా అత్యంత భారీ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం వంటి ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ భారీ వర్షాలు పడవచ్చు. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే పలు పోర్టుల్లో ప్రమాద హెచ్చరిక సంకేతాలను ఎగురవేశారు. నెల రోజుల వ్యవధిలో రాష్ట్ర తీరాన్ని తాకనున్న మూడో తుపాను కావడంతో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ఈ తుపాను ప్రభావం ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలపై కూడా ఉంటుందని జాతీయ వార్తా సంస్థల కథనాలు పేర్కొన్నాయి. నవంబర్ 20, 21 తేదీల్లో ఛత్తీస్‌గఢ్‌లోని దక్షిణ జిల్లాల్లో భారీ వర్షాలు, మధ్యప్రదేశ్‌లోని 9 జిల్లాల్లో ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది.

అలగనూరు సభను విజయవంతం చేయాలి -



(పెద్దపల్లి, సాక్షర): నవంబర్ 29న దీక్షా దివస్ సందర్భంగా.. కరీంనగర్ సమీపంలోని అలుగునూరులో నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లపై పెద్దపల్లి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ నెల 29వ తేదీన కరీంనగర్ సమీపంలోని అలుగునూరు ప్రాంతంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నాం. సభకు వేలాదిగా ప్రజలు, పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరుతున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు మూల కారణమైన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చారిత్రాత్మక ఆమరణ నిరాహార దీక్ష మరియు ఆనాడు ఆయన తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాన్ని ప్రజలకు మరోసారి గుర్తుచేయడానికి ఈ సభను అత్యంత ఘనంగా జరుపుతున్నాం. కేసీఆర్ సచ్చుడో... తెలంగాణ వచ్చుడో" అనే నినాదంతో ఆనాడు ఆయన తీసుకున్న పటిష్టమైన నిర్ణయం వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది. అందుకే ఆ చారిత్రక అంశాన్ని నేటి తరానికి, ప్రజలందరికీ వివరించడమే ఈ సభ ముఖ్య ఉద్దేశ్యం. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో ప్రస్తుత ప్రభుత్వం విఫలమైంది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం సజావుగా అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు నిలిచిపోయాయని అన్నారు. రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు, నిరంతర విద్యుత్ సరఫరా మరియు యూరియా పంపిణీ సరిగ్గా జరగడం లేదు. కొనుగోలు కేంద్రాలను సకాలంలో ప్రారంభించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేస్తే రైతులకు బోనస్, రైతుబంధు ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే ప్రభుత్వం కేంద్రాల ఏర్పాటులో జాప్యం చేస్తోంది. "ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం, మూడు పంటలకు రైతుబంధు ఇస్తాం" అని కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలు, చెప్పిన మాటలు ఇప్పుడేమయ్యాయి? రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించేంతవరకు బీఆర్ఎస్ పార్టీ పక్షాన ఖచ్చితమైన ఉద్యమ కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. . ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, పార్టీ టౌన్ ప్రెసిడెంట్ ఉప్పు రాజ్ కుమార్ మరియు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ బీమా అమలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: సీఎస్ సంజయ్ జాజు



(హైదరాబాద్, సాక్షర): బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పథకం అమలుపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీతో పాటు అన్ని మున్సిపల్ వార్డుల్లో ప్రత్యేక నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రస్తుతం వివిధ వర్గాలకు అమలవుతున్న బీమా పథకాలను ఇందిరమ్మ కుటుంబ బీమా పరిధిలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. నేతన్నలు,గౌడులు, కార్మికులు, మత్స్యకారులకు ప్రస్తుతం అందిస్తున్న రూ.2 లక్షల జీవిత బీమాను ఇందిరమ్మ బీమా పరిధిలోకి తీసుకురావడం ద్వారా రూ.5 లక్షలకు పెంచనున్నట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా భద్రత కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి కుటుంబంలోని సభ్యులందరూ పథకంలో నమోదు చేసుకునేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజలకు అవగాహన కల్పించేందుకు అన్ని ప్రచార మాధ్యమాలను వినియోగించాలని సూచించారు. పథకం మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ నమోదు ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. దాదాపు నెల రోజుల పాటు కొనసాగనున్న నమోదు ప్రక్రియకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, ఇందుకోసం ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

మొదటి పేజీ తరువాయి

మరోసారి వేలానికి హైదరాబాద్ భూములు

భూముల విస్తీర్ణం, ప్రాంతాల ప్రత్యేకతలు, తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాలు, ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ) చెల్లింపులు, ఆ తర్వాత చేపట్టే ప్రాజెక్టులకు సంబంధించిన నిబంధనలపై స్పష్టతనిచ్చారు. పారదర్శకమైన రీతిలో ఈ-వేలం నిర్వహించడమే తమ లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ-వేలం షెడ్యూల్ వివరాలు: నవంబర్ 25: హుడా హైట్స్‌లోని 8 ప్లాట్లకు వేలం జరగనుంది. ఈ వేలం ఉదయం 11:00 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు కొనసాగుతుంది. నవంబర్ 27: నియోపొలిస్‌లోని 4.59 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న స్థలానికి ఉదయం 11:00 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు వేలం నిర్వహించనున్నారు. మూసాపేట్‌లోని 3.15 ఎకరాల స్థలానికి మధ్యాహ్నం 3:00 గంటల నుంచి సాయంత్రం 6:00 గంటల వరకు ఆన్‌లైన్ బిడ్డింగ్ జరగనుంది.ఈ ప్రీ-బిడ్ సమావేశం ద్వారా స్థలాల వివరాలు, వేలం నిబంధనలు, చెల్లింపుల విధానంపై పూర్తి స్పష్టత రావడంతో ఆసక్తిగల కొనుగోలుదారులు, సంస్థలు పెద్ద ఎత్తున ఈ-వేలంలో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నాయి.

ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి

(హైదరాబాద్, సాక్షర): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోతే కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం తప్పదని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. పెండింగ్ ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం నేత సతీష్ ఆధ్వర్యంలో అబిడ్స్ నుంచి చేపట్టిన చలో సెక్రటేరియట్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. సెక్రటేరియట్‌కు వెళ్తున్న ర్యాలీని పోలీసులు బషీర్‌బాగ్ చౌరస్తా వద్ద అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. అధికారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తప్పుదోవ పట్టిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకుని పెండింగ్‌లో ఉన్న రూ.8,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ముఖ్యమంత్రి ఇల్లు , క్యాంప్ ఆఫీస్ లక్షల మందితో ముట్టడిస్తామని హెచ్చరించారు.

సింగరేణి బకాయిలు విడుదల చేయాలి..

- భూపాలపల్లిలో ఏఐటీయూసీ నిరాహార దీక్షలు



(భూపాలపల్లి, సాక్షర): సింగరేణి జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రెండు రోజుల నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేష్ దీక్షలను ప్రారంభించగా, వివిధ విభాగాల కార్మికులు, ఫిట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరగడంతో కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఏఐటీయూసీ నేతలు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సంస్థకు చెల్లించాల్సిన సుమారు రూ.60 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా మెడికల్ బోర్డులు నిర్వహించాలని, అర్హులకు మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించాలని కోరారు. తొమ్మిది నెలలుగా వీవీటీసీ ఆర్డర్ల కోసం ఎదురుచూస్తున్న కార్మికులకు నెల రోజుల్లో ఆర్డర్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

మంత్రి సీతక్కకు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సవాల్



(బాల్గోండ, సాక్షర): మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మంత్రి సీతక్కకు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నిజామాబాద్ జిల్లాలో 17,131 మంది పెన్షన్లు రద్దు చేశారు. ఇప్పుడు 20,555 పెన్షన్లు ఇస్తున్నామని గొప్పగా చెప్పుకుంటున్నారు. నిజానికి వీళ్లు తొలగించిన పెన్షన్లతో పోల్చితే కొత్తగా ఇచ్చేది 3,424 మందికి మాత్రమేనని అన్నారు. అది కూడా కేసీఆర్ ఇచ్చిన 2,000 ఇస్తున్నారు కానీ వీళ్లు హామీ ఇచ్చిన 4,000 ఇవ్వడంలేదు. అప్పుడు అది కేసీఆర్ ఇచ్చిన పథకమే అవుతుంది కానీ కొత్త పథకం ఎలా అవుతుందని ప్రశ్నించారు. దానికే ప్రతి నియోజకవర్గంలో మంత్రులు, ఎమ్మెల్యేలు సభలు పెడుతున్నారు. చనిపోయిన వారి స్థానంలో పెన్షన్లు ఇచ్చి కొత్తగా ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారుజ నేను చెప్పింది తప్పు అని నిరూపిస్తే నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. నిరూపించకపోతే సీతక్క, మహేష్ కుమార్ గౌడ్ రాజీనామా చేస్తారా అని నిలదీసారు.

సీఎం రేవంత్ రెడ్డి పర్యటన విజయవంతం చేయాలని అధికారులకు మంత్రి ఆదేశం



- బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

(సిద్దిపేట, సాక్షర): గురువారం జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రి దామోదర్ రాజనర్సింహ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటన లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభోత్సవంతోపాటు అభివృద్ధి, శంకుస్థాపనలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారని మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. బహిరంగ సభకు భారీగా ప్రజలు తరలిరానున్న నేపథ్యం లో వేదిక ఏర్పాట్లు, కుర్చీలు, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, నిరంతరాయ విద్యుత్తు, సౌండ్ సిస్టమ్, మెడికల్ క్యాంపు, అంబులెన్స్‌లు , హెలిప్యాడ్,ముఖ్యమంత్రి పాదయాత్ర,వాహన పార్కింగ్ ఏర్పాట్ల పై మంత్రి దామోదర్ రాజనర్సింహ జిల్లా కలెక్టర్, అధికారులతో చర్చించారు.

సిద్దిపేట సమగ్ర అభివృద్ధికి 12 డిమాండ్లు



- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సిద్దిపేట జిల్లా ఫోరం బహిరంగ లేఖ

సిద్దిపేట, నవంబర్ 18: సిద్దిపేట జిల్లా సమగ్ర అభివృద్ధికి పెండింగ్‌లో ఉన్న సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని కోరుతూ సిద్దిపేట జిల్లా ఫోరం రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ విడుదల చేసింది. జిల్లా అభివృద్ధికి సంబంధించి ద్వాదశ అంశాలను ప్రస్తావిస్తూ, వాటిని వెంటనే అమలు చేయాలని ఫోరం ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిద్దిపేట కేంద్రంగా అన్ని ఉన్నత విద్యా కోర్సులతో కూడిన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, క్యాన్సర్ ఆసుపత్రిని నిర్మించడంతో పాటు వెయ్యి పడకల ఆసుపత్రిని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అత్యంత పురాతనమైన సిద్దిపేట మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా విస్తరించి, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. రాజీవ్ రహదారిని జాతీయ రహదారిగా గుర్తించి ఎనిమిది వరుసలుగా విస్తరించాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా డ్రై పోర్టును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సుడా (SUDA)కు వెంటనే పాలకవర్గాన్ని నియమించి, అభివృద్ధి పనుల కోసం రూ.1,000 కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. జిల్లా కేంద్రం చుట్టూ నిర్మిస్తున్న రింగ్‌రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్ పనులను వేగవంతం చేసి చర్లపల్లి టెర్మినల్‌తో అనుసంధానం చేయాలని, జిల్లా కోర్టు భవన సముదాయాన్ని, జిల్లా పరిషత్ భవనాన్ని, బీసీ భవనాన్ని వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఫోరం అధ్యక్షుడు వంగ రామచంద్రారెడ్డి, సమన్వయకర్త తుమ్మనపల్లి శ్రీనివాసు మాట్లాడారు. కార్యక్రమంలో గుర్రాల శ్రీనివాసు, గుండ్ల జనార్దన్, అమ్మాన చంద్రారెడ్డి, వీరారెడ్డి, బోయ రాములు, చొప్పదండి సుధాకర్, ముజఫర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు

మొదటి పేజీ తరువాయి

తమిళనాడు, కర్ణాటక మధ్య కావేరి వార్...

జలాశయం నిర్మిస్తే తమకు వచ్చే కావేరీ నీటి ప్రవాహంపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా డెల్టా ప్రాంత రైతుల సాగునీటి అవసరాలు దెబ్బతింటాయని వాదిస్తోంది. కర్ణాటకకు నీటి నిల్వ అవసరం. తమిళనాడుకు నీటి ప్రవాహంపై భరోసా కావాలి. ఈ రెండు వాదనల మధ్యే మేకదాటు వివాదం కొనసాగుతోంది.కావేరీ నదిపై ఎగువ ప్రాంతంలో కర్ణాటక జలాశయం నిర్మిస్తే నీటి నిల్వ, విడుదలపై ఆ రాష్ట్రానికి మరింత నియంత్రణ లభిస్తుందని తమిళనాడు భావిస్తోంది. దీనివల్ల తమకు కేటాయించిన నీటి వాటా అందడంలో ఇబ్బందులు తలెత్తవచ్చని వాదిస్తోంది. కావేరీ డెల్టాలో వరి సాగు ఎక్కువగా జరుగుతుంది. ఈ ప్రాంత రైతులు నదీ జలాలపైనే ఆధారపడుతున్నారు. నీటి విడుదలలో ఆలస్యం జరిగినా పంటలపై ప్రభావం పడుతుంది. అందుకే మేకదాటు నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దని తమిళనాడు పట్టుబడుతోంది.మరోవైపు కర్ణాటక తన ప్రతిపాదనను సమర్థిస్తోంది. బెంగళూరు నగరం వేగంగా విస్తరిస్తుండటంతో తాగునీటి అవసరాలు పెరుగుతున్నాయని చెబుతోంది. భవిష్యత్తులో నీటి కొరత రాకుండా జలాశయం ఉపయోగపడుతుందని వివరిస్తోంది. వర్షాకాలంలో వచ్చే నీటిని నిల్వ చేసుకోవచ్చని అంటోంది. తమిళనాడుకు కేటాయించిన 177.25 టీఎంసీల నీటిని విడుదల చేసే బాధ్యతను తాము పాటిస్తామని చెబుతోంది. జలాశయం వల్ల తమిళనాడుకు కూడా ప్రయోజనం ఉంటుందని కర్ణాటక వాదిస్తోంది. అయితే ఈ వాదనలను తమిళనాడు అంగీకరించడం లేదు. నీటి వాటా కేటాయింపులు ఉన్నప్పటికీ.. అదనపు జలాశయం వల్ల భవిష్యత్తులో తమకు ఇబ్బందులు రావచ్చని ఆందోళన చెందుతోంది.మేకదాటు విషయంలో తమిళనాడు అభ్యంతరాలు కొనసాగుతున్న సమయంలో విజయ్ కర్ణాటక సీఎంతో ఒకే వేదికపై కనిపించడం వివాదానికి కారణమైంది. సోనియా గాంధీ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఇద్దరూ కలుసుకున్నారు. ఈ భేటీలో కావేరీ జలాల అంశాన్ని విజయ్ ప్రస్తావించారా లేదా అన్నది కూడా చర్చకు వచ్చింది. రాష్ట్ర హక్కుల కోసం పోరాడాల్సిన సమయంలో రాజకీయ మర్యాదలకే ప్రాధాన్యం ఇచ్చారని ప్రతిపక్షాలు విమర్శించాయి. విజయ్ ఢిల్లీ పర్యటనపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తమిళనాడు ప్రయోజనాలను కాపాడాల్సిన ముఖ్యమంత్రి, ముందుగా మేకదాటు ప్రాజెక్టుపై తన వ్యతిరేకతను స్పష్టంగా తెలియజేయాల్సిందని బీజేపీ నేతలు అంటున్నారు. కర్ణాటక సీఎం ప్రాజెక్టు నిర్మాణంపై పట్టుదలగా ఉన్న సమయంలో విజయ్ ఆయనతో స్నేహపూర్వకంగా కనిపించడం తప్పు సంకేతాలు ఇస్తోందని విమర్శిస్తున్నారు. రాష్ట్ర హక్కుల విషయంలో రాజకీయ రాజీలు ఉండకూడదని బీజేపీ వాదిస్తోంది. ఈ ఘటనను విజయ్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఉపయోగించుకుంటోంది.బీజేపీతో పాటు తమిళనాడులోని ప్రధాన ప్రతిపక్షాలు కూడా విజయ్‌పై విమర్శలు పెంచాయి. డీఎంకే నేతలు విజయ్ మేకదాటు సమస్యను సీరియస్‌గా తీసుకోవడం లేదని ఆరోపించారు. ఈ అంశంపై రాష్ట్రంలోని అన్ని పార్టీలతో సమావేశం నిర్వహించి ఉమ్మడి వైఖరిని ప్రకటించాలని మాజీ సీఎం స్టాలిన్ డిమాండ్ చేశారు. మేకదాటు విషయంలో రాజకీయాలకు అతీతంగా తమిళనాడు ఒక్కటిగా నిలవాలని పిలుపునిచ్చారు. అన్నాడీఎంకే కూడా విజయ్ తీరును తప్పుబట్టింది. కాంగ్రెస్ మద్దతుపై ఆధారపడటం వల్లే కర్ణాటక విషయంలో గట్టిగా మాట్లాడలేకపోతున్నారని విమర్శించింది. రాష్ట్ర హక్కుల కంటే ముఖ్యమంత్రి పదవికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించిందిమరోవైపు విజయ్ కూడా ఈ వివాదంపై స్పందించారు. కావేరీ సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న ఉద్దేశంతో కర్ణాటకకు వెళ్లాలని భావించినట్లు తెలిపారు. తమిళనాడు ప్రజల ప్రయోజనాల కోసం అవమానాలు ఎదురైనా భరించేందుకు సిద్ధమని పేర్కొన్నారు. కావేరీ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మేకదాటు ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు. పొరుగు రాష్ట్రంతో చర్చలు జరపడం తప్పు కాదని, సమస్యకు పరిష్కారం కనుగొనడమే ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. దీంతో ఈ వివాదం కేవలం వేదిక పంచుకున్న అంశం నుంచి, విజయ్ రాజకీయ వైఖరి చుట్టూ తిరిగే చర్చగా మారింది.విజయ్ తీరును కాంగ్రెస్ నేతలు సమర్థించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఆహ్వానం మేరకే ఆయన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యారని కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ తెలిపారు. ఒక కార్యక్రమంలో ఇద్దరు ముఖ్యమంత్రులు కలుసుకోవడాన్ని నీటి వివాదంతో ముడిపెట్టడం సరికాదని అన్నారు. బీజేపీ, డీఎంకే రాజకీయ ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని పెద్దది చేస్తున్నాయని విమర్శించారు. అయితే కాంగ్రెస్ సమర్థనతో వివాదం సద్దుమణగలేదు. తమిళనాడు హక్కుల విషయంలో విజయ్ మరింత స్పష్టంగా వ్యవహరించాలన్న డిమాండ్ కొనసాగుతోంది.మేకదాటు వివాదం రాజకీయాలకే పరిమితం కాలేదు. న్యాయపరంగానూ కొనసాగుతోంది. 2018లో కావేరీ జలాల పంపిణీపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. తమిళనాడుకు ఏటా 177.25 టీఎంసీల నీరు కేటాయించింది. 2025 నవంబర్‌లో మేకదాటు ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ తయారీ అనుమతిపై తమిళనాడు వేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. అయితే దీనివల్ల ప్రాజెక్టు నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చిందని కాదు. 2026 జూన్‌లో కేంద్ర జల సంఘం కర్ణాటక సమర్పించిన డీపీఆర్‌ను తిరిగి పంపింది. కావేరీ జలాల కేటాయింపులకు అనుగుణంగా మార్పులు చేయాలని సూచించింది. అంటే ప్రాజెక్టు నిర్మాణానికి ఇంకా అనేక అనుమతుల ప్రక్రియలు మిగిలే ఉన్నాయి.ఈ వివాదంలో అసలైన ఆందోళన రైతులదే. కావేరీ నీరు సకాలంలో అందకపోతే పంటలు దెబ్బతింటాయి. సాగు ఖర్చులు పెరుగుతాయి. రైతుల ఆదాయంపై ప్రభావం పడుతుంది. తమిళనాడులోని కావేరీ డెల్టా ప్రాంతం వ్యవసాయానికి ఎంతో కీలకం. కర్ణాటకలోనూ తాగునీటి అవసరాలు పెరుగుతున్నాయి. రెండు రాష్ట్రాల అవసరాలు నిజమైనవే అయినప్పటికీ.. నీటి పంపిణీలో ఎవరికీ అన్యాయం జరగకూడదు. నీటి చుక్క రైతుకు జీవం. రాజకీయ నాయకుడికి అది కేవలం ఎన్నికల అంశం కాకూడదు.సినీ రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన విజయ్‌కు ఇది కీలకమైన పరీక్షగా మారింది. ప్రజాదరణ సంపాదించడం ఒక ఎత్తు. రాష్ట్ర సమస్యలను పరిష్కరించడం మరో ఎత్తు. ఒకవైపు కాంగ్రెస్ నేతలతో రాజకీయ సంబంధాలు కొనసాగించాలి. మరోవైపు కర్ణాటకతో నీటి వివాదంలో తమిళనాడు ప్రయోజనాలను కాపాడాలి. ఈ రెండింటి మధ్య సమతూకం పాటించడం విజయ్‌కు సవాలుగా మారింది. ముఖ్యంగా మేకదాటు విషయంలో ఆయన తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో రాజకీయంగా ప్రభావం చూపనున్నాయి.మేకదాటు వివాదం ఇప్పుడు నీటి సమస్యను దాటి రాజకీయ పోరాటంగా మారింది. కర్ణాటక తన ప్రాజెక్టు కోసం పట్టుబడుతోంది. తమిళనాడు తన నీటి హక్కుల కోసం పోరాడుతోంది. మధ్యలో విజయ్ రాజకీయ వైఖరి చర్చనీయాంశంగా మారింది. బీజేపీ విమర్శలు. డీఎంకే, అన్నాడీఎంకే ఆరోపణలు. కాంగ్రెస్ సమర్థనతో వ్యవహారం మరింత వేడెక్కింది. రాజకీయ బంధాలు మారుతుంటాయి. కానీ రాష్ట్ర ప్రయోజనాలు శాశ్వతం. మేకదాటు విషయంలో విజయ్ మాటలకు, చేతలకు మధ్య స్పష్టత కనిపించాల్సి ఉంది. తమిళనాడు నీటి హక్కుల కోసం ఆయన ఎంత బలంగా నిలబడతారన్నదే ఈ రాజకీయ వివాదంలో కీలకంగా మారనుంది.

పెన్షన్ల పెంపుతో పాటు హుజురాబాద్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి
- కమలాపూర్ మండలంలో చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే
- కమలాపూర్ మండలంలో నిర్వహించిన చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 45 లక్షల మందికి, హుజురాబాద్ నియోజకవర్గంలో 44,373 మందికి పెన్షన్లు అందించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వృద్ధాప్య, వితంతు పెన్షన్లను ₹4,000కు, వికలాంగుల పెన్షన్లను ₹6,000కు వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. దళిత బంధు పొందిన కుటుంబాల్లో అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు కూడా పెన్షన్లు అందించాలని, హుజురాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ₹1,000 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. రానున్న ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీరు, సాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పేదల సంక్షేమం, రైతుల సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగే వరకు ప్రజల పక్షాన తన పోరాటం కొనసాగిస్తానని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు

మొదటి పేజీ తరువాయి

మైక్రోసాఫ్ట్, బ్యాంకులు, విమానాల సేవలు ఒకేసారి ఆగిపోవడంపై అనుమానాలు.. క్లారిటీ ఇచ్చిన అమెరికా

అలాగే కొన్నిరోజుల క్రితం బ్యాంకింగ్ వ్యవస్థ స్తంభించడం కూడా వీటికి లింకు లేదని తేల్చిచెప్పారు. వరుస ఘటనలతో ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొన్న మాట వాస్తవమేనని, అయితే వ్యవస్థలపై జరుగుతున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. కంప్యూటర్ వ్యవస్థల్లో లోపాలను సరిదిద్దే క్రమంలో తాత్కాలికంగా సమస్యలు తలెత్తవచ్చని, కృత్రిమ మేధ (ఏఐ) పాత్రపై ఊహాగానాలు చేయవద్దని కంపెనీలనే నేరుగా వివరాలు అడగాలని హితవు పలికారు. గత శుక్రవారం దేశవ్యాప్తంగా విమానాల రాకపోకలు నిలిచిపోవడంపై దర్యాప్తు జరిపిన ఎఫ్ఏఏ సైతం సైబర్ దాడి ఆనవాళ్లు లేవని నిర్ధారించింది. టెలికాం నెట్‌వర్క్‌లోకి డేటా విపరీతంగా పోటెత్తడంతో విమాన రాడార్, కమ్యూనికేషన్ వ్యవస్థల్లో సమస్యలు తలెత్తినట్లు తేల్చింది. అర్కాన్సాస్‌లోని నెట్‌వర్క్ కేంద్రంలో ఎల్3 హ్యారిస్ సంస్థ కొత్త రూటర్‌ను ఏర్పాటు చేసే సమయంలో సాంకేతిక లోపం తలెత్తినట్లు గుర్తించారు. దాదాపు ఐదు గంటల పాటు రాకపోకలు స్తంభించినప్పటికీ గాల్లో ఉన్న 3,500 విమానాలు సురక్షితంగా ల్యాండ్ అయ్యాయి. సెనేట్ ఇంటెలిజెన్స్ కమిటీ ఉపాధ్యక్షుడు మార్క్ వార్నర్ కూడా ఈ వైఫల్యాల వెనుక ఎలాంటి విదేశీ శక్తుల జోక్యం లేదని ధ్రువీకరించారు.

వేములవాడ రాజన్న ఆలయ గోపుర విస్తరణపై అపోహలు వద్దు..

- వేములవాడ ఆలయ ప్రధాన అర్చకులు

(వేములవాడ, సాక్షర): శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ విమాన గోపుర విస్తరణ పనులపై భక్తులు ఎలాంటి అపోహలకు గురికావద్దని ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు తెలిపారు.ఆగమ శాస్త్ర పండితులు, స్థపతులు, శృంగేరి పీఠాధిపతుల ఆశీస్సులు, సూచనల మేరకే గోపురాన్ని శిలామయంగా, మరింత ఎత్తుగా నిర్మిస్తున్నట్లు తెలిపారు.గర్భాలయం, మూలవిరాట్లు (స్వామివారు, అమ్మవార్లు), గర్భగృహంలో ఎలాంటి మార్పులు ఉండవని, అవి పూర్తిగా సురక్షితంగా ఉంటాయని స్పష్టం చేశారు."శిఖర దర్శనం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే" అన్నట్లు.. భక్తులందరికీ గోపురం అన్ని దిశల నుంచి స్పష్టంగా కనిపించి, దర్శన భాగ్యం కలిగేలా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. అందువల్ల భక్తులు ఎలాంటి వదంతులను నమ్మవద్దని ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు విజ్ఞప్తి చేశారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో గ్రామీణ వృద్ధ దంపతుల సందడి

హైదరాబాద్‌లోని శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇటీవల చోటుచేసుకున్న ఓ దృశ్యం నెటిజన్ల మనసులను అమితంగా హత్తుకుంటోంది. గ్రామీణ ప్రాంతానికి చెందిన వృద్ధ దంపతులు విమానం ఎక్కేందుకు ఎయిర్‌పోర్టుకు వచ్చారు. ఆధునిక హంగులతో ఉండే విమానాశ్రయంలోకి వారు తమ నిరాడంబరమైన పల్లెటూరి సంప్రదాయ వస్త్రధారణతోనే అడుగుపెట్టారు. చేతిలో సంచులతో, స్వచ్ఛమైన గ్రామీణ ఆహార్యంతో నడుచుకుంటూ వెళ్తున్న ఆ వృద్ధ జంటను చూసి అక్కడున్న ప్రయాణికులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో క్షణాల్లో వైరల్‌గా మారాయి. ఈ ఆసక్తికర వీడియోపై కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించారు. భారత విమానయాన రంగంలో వస్తున్న గణనీయమైన మార్పులకు ఈ దృశ్యమే గొప్ప నిదర్శనమని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ.. "ఒకప్పుడు విమానంలో ప్రయాణించడాన్ని కేవలం కలగా మాత్రమే భావించిన ఒక తరం.. నేడు నిజంగానే ఆకాశంలోకి ఎగురుతుండటాన్ని చూడటం కంటే అసలైన ప్రగతి ఇంకేముంటుంది.. భారతదేశ మారుతున్న విమానయాన కథను ఇంకేదీ ఇంత స్పష్టంగా ప్రతిబింబించలేదు" అని పేర్కొన్నారు. సాధారణంగా గతంలో విమాన ప్రయాణం అంటే కేవలం సంపన్నులకు, ఉన్నత వర్గాలకు మాత్రమే పరిమితమనే భావన ఉండేది. అయితే కాలక్రమంలో వస్తున్న మార్పులు, విస్తరిస్తున్న విమాన సర్వీసులు, ప్రోత్సాహకాల కారణంగా సామాన్య, గ్రామీణ ప్రజలకు కూడా విమానయానం అందుబాటులోకి వస్తోంది. ఎయిర్‌పోర్టులో ఆ వృద్ధ దంపతులు కనిపించిన తీరు దేశం సాధిస్తున్న సమ్మిళిత అభివృద్ధిని చాటిచెబుతోందని, సామాన్యుల ఆకాంక్షలు నెరవేరుతున్నాయనడానికి ఇదే నిదర్శనమని నెటిజన్లు కూడా పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి

కృష్ణా జలాలపై సమరం.. ప్రభుత్వంపై కేటీఆర్ ధ్వజం

ప్రస్తుతం రేవంత్ రెడ్డి తెలంగాణకు ఎక్కువ అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీటిని తరలించేందుకు నాగార్జునసాగర్‌లో సొరంగం తవ్వినా.. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రులు మౌనంగా ఉన్నారని కేటీఆర్ ఆరోపించారు. 18 గంటలు పనిచేసే ముఖ్యమంత్రికి ఇది తెలియదా? తెలంగాణ మంత్రులు ఏం చేస్తున్నారనిలదీసారు పాలమూరు జిల్లాకు కృష్ణా జలాల కేటాయింపులో కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్డీఎస్‌లో జరిగిన నష్టాన్ని కేసీఆర్ సరిదిద్దారని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ నదీ జలాలకు సమైక్య రాష్ట్రంలో జరిగిన అన్యాయం చెబితే భారతం, రాస్తే రామాయణం. సమైక్య పాలకులు మనకు న్యాయం చేయరని నిపుణులతో చర్చించాకే.. కేసీఆర్ 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే నినాదంతో ఉద్యమాన్ని ముందుండి నడిపించారు తెలంగాణకు నదీ జలాల కేటాయింపుల్లో అన్యాయం జరిగిందని కేటీఆర్ విమర్శించారు. ఈ విషయాన్ని కేసీఆర్ పలుమార్లు ప్రస్తావించారని పేర్కొన్నారు. 10 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చే ఏలేశ్వరం ప్రాజెక్టును రద్దు చేసి.. కిందకు నందికొండకు తరలించారు. నాగార్జున సాగర్ నుంచి తెలంగాణకు 8.8 లక్షల ఎకరాలకు నీళ్లు వస్తాయని అప్పట్లో చెప్పారు. కానీ.. 6 లక్షల ఎకరాలు దాటలేదు, ఏపీలో 15 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చే ప్రాజెక్ట్‌గా మార్చేశారు. నాగార్జున సాగర్ డెడ్ స్టోరేజీ నుంచి అక్రమంగా నీటిని తరలించేందుకు ఏపీ భారీ టన్నెల్ ప్రాజెక్టు చేపట్టినా తెలంగాణ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుమతితోనే ఏపీ ప్రభుత్వం ఈ టన్నెల్ ప్రాజెక్టును చేపట్టిందా? ఏపీ ప్రభుత్వం ఇంత భారీ ఎత్తున ప్రాజెక్టు పనులు చేస్తున్నా తెలంగాణ ప్రభుత్వానికి కనీస సమాచారం లేదా? అదే నిజమైతే మన నిఘా వ్యవస్థ ఏం చేస్తున్నట్టు!? తెలంగాణ ప్రభుత్వానికి ఏపీ అక్రమ ప్రాజెక్టుపై కనీస సమాచారం లేదంటే ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఒక్క క్షణం కూడా పదవిలో ఉండడానికి అర్హుడు కాడు . వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి.. ఎలాంటి అనుమతులు లేకుండా ఏపీ చేపట్టిన అక్రమ ప్రాజెక్టు పనులను అడ్డుకునేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని అయన అన్నారు.

మొదటి పేజీ తరువాయి

డిసెంబరు 22 వరకు ఓటరు నమోదు పొడిగింపు

ఓటర్ల జాబితాలో గైర్హాజరు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, మరణించినవారు, డూప్లికేట్ ఓటర్లు అనే కేటగిరీల్లో గుర్తించిన వారిని ఏఎస్‌డీఈ జాబితాలో చేర్చుతారు. ఈ జాబితాలో ఉన్న ఓటర్ల వివరాలను మరోసారి పరిశీలించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక ఎన్యుమరేషన్ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది. ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నుంచి వచ్చిన ప్రతిపాదనల నేపథ్యంలో ఈ కేటగిరీ ఓటర్లకు మరో అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలను ఈ నెల 18వ తేదీలోగా ముద్రించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈనెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో ఫారాలను పంపిణీ చేసి, తిరిగి సేకరించనున్నారు.ఎన్నికల సంఘం తాజాగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఎన్యుమరేషన్ ఫారాల పరిశీలన, పరిష్కార ప్రక్రియను డిసెంబర్ 10వ తేదీలోగా పూర్తి చేయాలి. అనంతరం ఓటర్ల జాబితాకు సంబంధించి నోటీసుల జారీ, క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణతోపాటు వాటి పరిష్కార ప్రక్రియను డిసెంబర్ 15వ తేదీ వరకు కొనసాగించనున్నారు. ఆ తర్వాత తుది ఓటర్ల జాబితాను డిసెంబర్ 22వ తేదీన ప్రచురించనున్నారు. గతంలో నవంబర్ 30వ తేదీన తుది జాబితా విడుదల చేయాలని నిర్ణయించినప్పటికీ.. తాజాగా ఈ గడువును డిసెంబర్ 22వ తేదీ వరకు పొడిగించారు.తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ, నాగాలాండ్, హరియాణా, జార్ఖండ్ రాష్ట్రాల్లోనూ ఈ సవరించిన షెడ్యూల్ అమలు కానుంది. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సవరించిన షెడ్యూల్‌పై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని రాష్ట్ర ఎన్నికల అధికారులను ఈసీ ఆదేశించింది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు కూడా కొత్త గడువులు, ప్రక్రియ వివరాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించింది.ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. పేరు లేకపోయినా, ఓటు హక్కుకు అర్హత ఉన్నవారు నిర్ణీత ప్రక్రియ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఏఎస్‌డీఈ కేటగిరీలో ఉన్నవారు కూడా తాజా షెడ్యూల్ ప్రకారం తమ వివరాలను ధ్రువీకరించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా, ఎన్యుమరేషన్ ఫారాలు, ఇతర సందేహాల నివృత్తి కోసం ఎన్నికల సంఘం టోల్‌ఫ్రీ నంబర్ 1950ను సంప్రదించవచ్చని వెల్లడించారు. గడువు పొడిగింపుతో అర్హులైన ఓటర్లు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకునేందుకు, తప్పులను సరిచేసుకునేందుకు మరింత సమయం లభించనుందని వివరించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పథకాల అమలు

- ఈ నెల 19వ తేదీ నుంచి చేయూత లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో నేరుగా డబ్బులు జమ
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



(చొప్పదండి, సాక్షర): బోయినపల్లి మండలంలోని 567మంది లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలు అందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. ముందుగా జయ జయహే తెలంగాణ గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రభుత్వ పథకాలు, చేయూత పెన్షన్ మంజూరుపై పాటల ద్వారా వివరించారు. బోయినపల్లి మండలంలోని 567మంది లబ్ధిదారులకు బోయినపల్లి మండలం కొత్తపేట గ్రామంలో పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. చేయూత పెన్షన్ కోసం ఇప్పటికే దరఖాస్తుదారులు స్వీకరించామని తెలిపారు. అర్హుల ఎంపిక కోసం గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులతో విచారణ చేయించామని పేర్కొన్నారు. 19వ తేదీన తర్వాత లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో నేరుగా డబ్బులు జమ అవుతాయని వెల్లడించారు. జిల్లా మొత్తం 8,209, బోయినపల్లి మండలంలో 567 నూతన పెన్షన్ మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. ఇంకా అర్హులు ఎవరైనా ఉంటే ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయడంలో బోయినపల్లి మండలంలో జిల్లాలో ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు ఇస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద ప్రతి కుటుంబానికి రూ.ఐదు లక్షల విలువైన బీమా వర్తిస్తుందని, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో నెల రోజుల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. రేషన్ కార్డు ఉన్నవారు లేనివారు సైతం అర్హులని స్పష్టం చేశారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలు ఇవ్వాలని సూచించారు. ఇందిరా మహిళా శక్తి చీరలు కూడా ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అనేక పథకాలు అభివృద్ధి అమలు చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో నూతనంగా దాదాపు ఐదు లక్షల చేయూత పెన్షన్లు సీఎం రేవంత్ రెడ్డి మంజూరు చేశారని వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ. ఐదు లక్షల ఆర్థిక సాయం అందజేస్తున్నామని, రేషన్ కార్డుదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. అలాగే నూతన రేషన్ కార్డులు అందిస్తున్నామని, కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయిస్తున్నామని వివరించారు. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 25 లక్షల మంది రైతులకు రూ. 21 వేల కోట్ల రుణమాఫీ చేశామని వెల్లడించారు. మండలంలో ఇందిరమ్మ ఇల్లు శరవేగంగా పూర్తవుతున్నాయని పేర్కొన్నారు. మండలంలో రోడ్లు, మౌలిక వసతుల కల్పన పనులు పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. 12 కోట్లతో స్టేడియం నిర్మాణ పనులు చేపట్టనున్నామని తెలిపారు. చొప్పదండి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ప్రకటించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శరత్ బాబు, తహసీల్దార్ షరీఫొద్దీన్, ఇంచార్జి ఎంపీడీఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

మొదటి పేజీ తరువాయి

నిధులు ఇవ్వకుంటే కురుక్షేత్రమే.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హెచ్చరిక!

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కేవలం సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాలకే నిధులు కుమ్మరించారని రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోనూ అదే తరహా సంస్కృతి కొనసాగుతుందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తన కొడంగల్‌పై, ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్‌నగర్‌పై, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధిరపై మాత్రమే ప్రత్యేక దృష్టి పెడుతున్నారని ఆరోపించారు. కొడంగల్ అభివృద్ధి కోసం రూ.10 వేల కోట్లు తీసుకెళ్తున్న ప్రభుత్వం.. ఫ్లోరైడ్ బారినపడి ఏళ్ల తరబడి అల్లాడుతున్న మునుగోడు ప్రజల కోసం చెరువులు, కుంటలను బాగుచేసేందుకు రూ.500 కోట్లు కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు.డిండి ఎత్తిపోతల పథకం పనులు మూడేళ్లుగా పడకేయడంతో నల్గొండ ప్రజల ప్రయోజనాలను బలిపెడుతున్నారని రాజగోపాల్ పేర్కొన్నారు. చౌటుప్పల్ 100 పడకల ఆసుపత్రి హామీ ఇప్పటికీ అటకెక్కి ఉందని మండిపడ్డారు. పార్టీ అంతర్గత సమావేశాల్లో వినతిపత్రాలు సమర్పిస్తే బుట్టదాఖలు చేస్తున్నారన్నారు. అదే ప్రజల ముందు ప్రశ్నిస్తే క్రమశిక్షణ చర్యల పేరిట నోరు నొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్‌కు కేటాయించే నిధులపై నిలదీస్తే 'పండబెట్టి తొక్కుతా' అంటూ మాట్లాడటం ఒక ముఖ్యమంత్రికి తగదని హితవు పలికారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని, ప్రజలకు జవాబు చెప్పాల్సిన బాధ్యత సర్కారుపై ఉందని తేల్చిచెప్పారు.

మొదటి పేజీ తరువాయి

30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ

18 వేల కోట్ల వ్యయాన్ని అంచనా వేసింది. ఇందులో అత్యధికంగా నీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలపై ఖర్చు చేయనున్నారు. రహదారుల నిర్మాణానికి రూ.5 వేల కోట్లు.. నీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణకు రూ.6 వేల కోట్లు.. విద్యుత్ మౌలిక సదుపాయాల కోసం రూ.2,350 కోట్లు.. మిగిలిన నిధులను ఇతర ప్రాథమిక వసతులకు ఖర్చు పెట్టనున్నారుఇప్పటికే ప్రారంభ దశ మౌలిక సదుపాయాల పనుల కోసం సుమారు రూ.2 వేల కోట్లు ఖర్చు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. హైదరాబాద్ నగరం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందితే దాదాపు 15 లక్షల మంది నివసించే అవకాశం ఉందని ఫ్యూచర్ సిటీ మెట్రోపాలిటన్ అథారిటీకి చెందిన ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. ఫ్యూచర్ సిటీకి నీటి అవసరాలను తీర్చేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. యెల్లంపల్లి రిజర్వాయర్ నుంచి రోజుకు 164 మిలియన్ లీటర్ల (ఎంఎల్‌డీ) నీటిని తీసుకురావాలని ప్రతిపాదించారు. ఇందులో 40 ఎంఎల్‌డీ నీటిని శుద్ధి చేసిన పునర్వినియోగ జలాల నుంచి సమకూర్చనున్నారు. మిగిలిన నీటి వనరులపై ప్రణాళికలో భాగంగా ఏర్పాట్లు చేయనున్నారు.హైదరాబాద్ నగరంలో వర్షపు నీటి సంరక్షణ, నీటి పునర్వినియోగానికి ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. అలాగే జీరో లిక్విడ్ డిశ్చార్జ్ విధానాన్ని అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అంటే శుద్ధి చేసిన నీటిని తిరిగి వినియోగించుకోవడం ద్వారా మురుగునీరు బయటకు విడుదల కాకుండా చర్యలు తీసుకోనున్నారు. ఫ్యూచర్ సిటీలో పరిశ్రమలు, డేటా సెంటర్లు, నివాస ప్రాంతాలకు నిరంతర విద్యుత్ సరఫరా అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో మీర్‌ఖాన్‌పేట ప్రాంతంలో ప్రత్యేక విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.భవిష్యత్తులో పెరిగే విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు. మొత్తంగా భారత్ ఫ్యూచర్ సిటీని కేవలం నివాస ప్రాంతంగా కాకుండా పరిశ్రమలు, సాంకేతికత, విద్య, వైద్యం, వినోదం కలిసిన సమగ్ర నగరంగా తీర్చిదిద్దాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. మాస్టర్ ప్లాన్ ఆవిష్కరణ తర్వాత ప్రాజెక్టు అమలు, పెట్టుబడుల సమీకరణ, మౌలిక సదుపాయాల నిర్మాణంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కారుకు ప్రమాదం.. దంపతులకు తప్పిన పెను ముప్పు!

రంగారెడ్డి : కాంగ్రెస్ ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూరి వెంకట్ ప్రయాణిస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. రంగారెడ్డి జిల్లా కొత్తూరు జంక్షన్ సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకుంది. తిరుపతి నుంచి హైదరాబాద్‌కు తిరిగి వస్తుండగా ఆయన కారు ముందున్న డీసీఎం వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. అయితే బల్మూరి వెంకట్, ఆయన సతీమణి ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. బల్మూరి వెంకట్ తన భార్యతో పాటు సోదరుడు చాణక్య, డ్రైవర్ శ్రీకాంత్‌తో కలిసి తిరుపతి నుంచి హైదరాబాద్‌కు కారులో బయలుదేరారు. ఈ క్రమంలో కొత్తూరు బైపాస్ సమీపంలోని దర్గా చౌరస్తా వద్దకు చేరుకోగానే ముందుగా వెళ్తున్న కోళ్ల లోడుతో కూడిన డీసీఎం వాహనాన్ని కారు వెనుక నుంచి ఢీకొట్టినట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది. డ్రైవర్ శ్రీకాంత్, ఎమ్మెల్సీ సోదరుడు చాణక్యకు స్వల్ప గాయాలయ్యాయి. బల్మూరి వెంకట్, ఆయన సతీమణి ఎలాంటి ప్రాణాపాయం లేకుండా బయటపడ్డారు. దీంతో కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

చెక్ బౌన్స్ కేసులో నిర్మాత బండ్ల గణేశ్‌కు ఏడాది జైలు శిక్ష

టాలీవుడ్ ప్రముఖ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్‌కు న్యాయస్థానంలో ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. చెక్ బౌన్స్ కేసులో ఆయనకు ఒంగోలు కోర్టు ఏడాది సాధారణ జైలు శిక్ష విధించింది. శిక్షతో పాటు రూ. 95 లక్షల భారీ జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కీలక తీర్పు వెలువరించారు.పూర్తి వివరాల్లోకి వెళితే... ఆర్థిక లావాదేవీలకు సంబంధించి జెట్టి వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి బండ్ల గణేశ్ తన నిర్మాణ సంస్థ 'పరమేశ్వర ఆర్ట్ ప్రొడక్షన్స్' పేరిట రూ. 95 లక్షల విలువైన చెక్ ఇచ్చారు. అయితే, బ్యాంక్ ఖాతాలో సరిపడా నిధులు లేకపోవడంతో ఆ చెక్ బౌన్స్ అయింది. నగదు చెల్లింపు విషయంలో న్యాయం జరగకపోవడంతో బాధితుడు ఒంగోలు కోర్టును ఆశ్రయించారు.ఈ కేసుపై న్యాయస్థానంలో సుదీర్ఘంగా విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం, నేరం రుజువు కావడంతో కోర్టు బండ్ల గణేశ్‌ను దోషిగా తేల్చింది. ఆయనకు ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ. 95 లక్షల జరిమానా విధించింది. జరిమానా మొత్తంతో పాటు, ఈ కేసు విచారణ నిమిత్తం బాధితుడికి అయిన కోర్టు ఖర్చులను కూడా బండ్ల గణేశే పూర్తిగా భరించాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు.గతంలోనూ పలు చెక్ బౌన్స్ కేసుల్లో బండ్ల గణేశ్‌కు న్యాయస్థానాలు జైలు శిక్షలు విధించగా, ఆయన హైకోర్టుల్లో అప్పీల్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే.

ఓటరు జాబితాలో పేరు లేని వారికి మరో అవకాశం

• ఏఎస్డీడీ ఓటర్ల నమోదుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి డిసెంబర్ 22న తుది ఓటరు జాబితా ప్రచురణ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర) ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని ఏఎస్డీడీ ఓటర్లకు తిరిగి పేరు నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఏఎస్డీడీ ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియ నవంబర్ 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు, డిసెంబర్ 10లోగా ఫారాల పరిశీలన పూర్తి చేయనున్నట్లు తెలిపారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార గడువును డిసెంబర్ 15 వరకు పొడిగించగా, తుది ఓటరు జాబితాను డిసెంబర్ 22న ప్రచురించనున్నట్లు వెల్లడించారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని, పేరు లేని వారు అవసరమైన పత్రాలతో సంబంధిత బూత్ స్థాయి అధికారిని (బీఎల్ఓ) సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. సందేహాల నివృత్తికి ఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నంబర్ 1950ను సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

• జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బుధవారం నిర్మల్ పట్టణంలో ప్రస్తుతం నిర్వహించబడుతున్న ప్రభుత్వ వైద్య కళాశాలలో సంబంధిత అధికారులతో, నూతన వైద్య కళాశాల నిర్మాణ వివరాలను సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన వైద్య కళాశాల నిర్మాణ పురోగతిని శాఖల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అన్ని విధాలైన సౌకర్యాలతో కూడిన వైద్య కళాశాల నిర్మించాలన్నారు. వైద్య విద్యను అభ్యసించేందుకు వీలుగా అన్ని విభాగాలను ఏర్పాటు చేయాలన్నారు. పనులన్నీ గడువులోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. చేపట్టిన పనులు నాణ్యవంతంగా ఉండాలన్నారు. విద్యార్థుల వసతి నివాసాల నిర్మాణాలు కూడా పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో వైద్య విద్యను అభ్యసించి, వసతి పొందేందుకు అనుగుణంగా నిర్మాణాలను చేపట్టాలన్నారు. కళాశాల నిర్మాణ పనులు అన్నింటిని తానే స్వయంగా ప్రతి వారం సమీక్షిస్తానని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి రాజేందర్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ శారద, ఆర్ అండ్ బి ఎఈ అంజనేశ్వర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలు



• విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన అదనపు కలెక్టర్ ఆర్.ఎస్.చిత్రు

(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర) విద్యార్థుల్లో ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించేందుకు ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు అదనపు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లాలో ఈ పోటీలను పకడ్బందీగా నిర్వహించామని, ఇందులో భాగంగా తొలుత జిల్లాలోని 90 పాఠశాలలు, 17 కళాశాలల్లో నవంబరు 2 నుంచి 7వ తేదీ వరకు ప్రాథమిక స్థాయిలో పోటీలు నిర్వహించడం జరిగిందని వివరించారు. నవంబరు 10 నుంచి 13 వరకు నియోజకవర్గ స్థాయిలో పోటీలు జరిగాయని, ఇందులో ప్రతిభ కనబరిచిన ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు చెందిన 61 మంది విద్యార్థులకు నేడు జిల్లా స్థాయి పోటీలు ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు.కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్ రావు, ఎన్నికల పర్యవేక్షణ అధికారిణి నలంద ప్రియ, నాయబ్ తహసీల్దార్లు మధుసూదన్, సూరజ్, ఇస్తారి, కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యువతలోని ప్రతిభకు యువజన ఉత్సవాలు చక్కని వేదిక

• రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి ఆదిలాబాద్‌కు గుర్తింపు తీసుకురావాలి జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను ప్రారంభించిన ఎంపీ గోడం నగేష్, కలెక్టర్ రాజర్షి షా



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర) ఆదిలాబాద్ యువతలో దాగి ఉన్న సృజనాత్మకత, కళా నైపుణ్యాలను వెలికితీసేందుకు యువజన ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎంపీ గోడం నగేష్ పిలుపునిచ్చారు.బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను ఎంపీ గోడం నగేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, జిల్లా కలెక్టర్ రాజర్షి షా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ.. యువత పోటీతత్వాన్ని అలవర్చుకుని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగినప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, నృత్యాలకు ఎంతో ప్రాచీన చరిత్ర ఉందని, పురాతన దేవాలయాల్లోని శిల్పకళలోనూ మన పూర్వీకుల కళా వైభవం, నృత్యరీతులు ప్రతిబింబిస్తాయని వివరించారు. గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుతూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు.పోటీల్లో పాల్గొనేటప్పుడు అందుబాటులో ఉన్న సమయాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని తమలోని ప్రతిభను సంపూర్ణంగా ప్రదర్శించాలని సూచించారు. 1998లో ఆదిలాబాద్‌లో జాతీయ స్థాయి యువజన ఉత్సవాలు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేస్తూ, ప్రస్తుత ఉత్సవాల్లో పాల్గొంటున్న యువతీయువకులు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిల వరకు విజేతలుగా నిలిచి అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు.జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. యువతలోని ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడంతోపాటు వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు యువజన ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీధి నాటకాలు, జానపద గీతాలు, నృత్యాలు, వ్యాసరచన, చిత్రలేఖనం, కవితా రచన తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన వారికి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.బాలికలు వివిధ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని, బాలురు సైతం అన్ని రంగాల్లో తమ నైపుణ్యాలను ప్రదర్శించాలని సూచించారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని అన్నారు. యువత నైపుణ్యాభివృద్ధికి స్టెప్ ద్వారా అవసరమైన శిక్షణ కార్యక్రమాలను అందిస్తున్నామని తెలిపారు.అనంతరం యువతీయువకులు ప్రదర్శించిన వివిధ కళారూపాలు, నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీఈఓ స్టెప్ సతీష్, పోటీల న్యాయ నిర్ణేతలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, యువతీయువకులు తదితరులు పాల్గొన్నారు.

77వ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



(ఆదిలాబాద్, సాక్షర): బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరం ఆవరణలో 77వ రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ సభ్యుడు జితేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖాడే ఉత్తం, అంజీ సర్పంచ్ విష్ణు, ఇతర సభ్యులు మనోజ్, మారుతి, సందీప్, ఉత్తం, నాయకులు సంజీవ్, శుద్ధోధన్, నారాయణ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలి

• రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

(చెన్నూరు, సాక్షర) కోటపల్లి ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారి విద్యా ప్రమాణాలు, హాజరు శాతం, ఏకాగ్రతను పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని కోటపల్లి మండలంలో గల మోడల్ స్కూల్‌లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, కోటపల్లి మండల తహసీల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వరరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ తివారి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్యారంగంలో భారీగా పెట్టుబడులు పెట్టడం జరుగుతుందని తెలిపారు. ఉదయం పూట అల్పాహారం తీసుకోకుండా పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు సి.ఎం. బ్రేక్‌ఫాస్ట్ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రోజంతా ఉత్సాహంగా చదువుకోవడంతో పాటు క్రీడలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 20 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరనుండగా, మంచిర్యాల జిల్లాలో సుమారు 35 వేల మంది విద్యార్థులకు, చెన్నూర్ నియోజకవర్గంలో సుమారు 12 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఎవరూ ఆకలితో పాఠశాలకు రాకూడదనే గొప్ప ఆలోచనతో ముఖ్యమంత్రి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. తాను 2009 నుంచి 2014 వరకు పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలోనే ఈ ప్రాంతంలో 109 మోడల్ పాఠశాలలు మంజూరయ్యాయని గుర్తుచేశారు. కోటపల్లి మోడల్ స్కూల్‌లో 301 మంది బాలురు, 237 మంది బాలికలు విద్యనభ్యసిస్తుండటం సంతోషంగా ఉందని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుండి క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని, ప్రతి ఒక్కరూ ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. తాము భవిష్యత్తులో డాక్టర్లు, ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు కావాలనే సంకల్పంతో చదువుకోవాలని, లక్ష్య సాధనకు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని తెలిపారు. పాఠశాల స్థాయిలోనే వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, మంచి నడవడిక అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుతం పాఠశాలలో మంచి ఫలితాలు సాధిస్తున్నప్పటికీ, సి.ఎం. బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలుతో ఇకపై 100 శాతం ఉత్తీర్ణతతో పాటు అత్యుత్తమ గ్రేడులు సాధించే దిశగా విద్యార్థులు కృషి చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులు 100 శాతం డిస్టింక్షన్ ఫలితాలు సాధిస్తే పాఠశాలకు ప్రత్యేక బహుమతి అందజేస్తానని తెలిపారు. మోడల్ స్కూల్‌లో సుమారు 500 మంది విద్యార్థులకు ఉపయోగపడేలా భోజనశాల నిర్మాణానికి 40 లక్షల రూపాయలు అవసరమని, ఇందులో 20 లక్షల రూపాయలు జిల్లా కలెక్టర్ ద్వారా, మరో 20 లక్షల రూపాయలు డిఎంఎఫ్‌టి నిధుల నుండి కేటాయించడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ నిధులు మంజూరు చేస్తున్నామని, ఇప్పటికే డిగ్రీ కళాశాలకు 2 కోట్ల రూపాయలు, ఇంటర్మీడియట్ కళాశాలకు 1.50 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని, కోటపల్లిలో సుమారు 90 లక్షల రూపాయలతో ఎస్.సి. వసతి గృహ నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలోని సోమనపల్లిలో 2 వేల 500 మంది విద్యార్థులకు వసతి సౌకర్యాలతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను వచ్చే విద్యా సంవత్సరం నుండి ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థుల వసతి అవసరాలను దృష్టిలో ఉంచుకొని అదనపు వసతి గృహ సీట్ల మంజూరు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. విద్యార్థులు సంప్రదాయ విద్యతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వివిధ నైపుణ్యాలను అభ్యసించాలని సూచించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సుమారు 4 వేల కోట్ల రూపాయల వ్యయంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. వీటి ద్వారా విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచనున్నట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, గురుకులాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాఠశాలల నుండి వచ్చే అవసరాల ప్రతిపాదనలను పరిశీలించి నిధులు మంజూరు చేయడం జరుగుతుందని, అవసరమైన మరమ్మతులు, త్రాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలలో ఎలాంటి అదనపు వసతులు అవసరమైనా పూర్తి వివరాలతో ప్రతిపాదనలు సమర్పించాలని, ఒకేసారి అన్ని అవసరాలను తెలియజేయడం ద్వారా పనులు పునరావృతం కాకుండా సమగ్రంగా అభివృద్ధి పనులు చేపట్టవచ్చని సూచించారు. అవసరమైన చోట బోర్‌వెల్స్, మరమ్మతులు, ఇతర సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, డైట్, కాస్మెటిక్ ఛార్జీల పెంపు వంటి పలు కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల హాజరు శాతం ఇప్పటికే సగటున 75 శాతానికి పైగా ఉండగా, కొన్ని సందర్భాలలో 80 శాతానికి చేరుతుందని తెలిపారు. ఈ పథకాలతో రానున్న రోజులలో హాజరు శాతం, విద్యా ఫలితాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. విద్యార్థులు మంచి ప్రవర్తన, సానుకూల దృక్పథం, క్రమశిక్షణ, కష్టపడే తత్వాన్ని అలవర్చుకొని తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థుల అభ్యున్నతికి జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అనంతరం మంత్రి, జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించి, ఆహార నాణ్యత, మెనూ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ల్యాబ్ గదిని ప్రారంభించారు. చెన్నూర్ మండలం కన్నేపల్లి నుండి సంకారం వరకు 90 లక్షల రూపాయల ఎం.ఆర్.ఆర్. 2024-25 నిధులతో పునరుద్ధరించిన బి.టి. రహదారిని ప్రారంభించారు. సంకారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలకు బెంచీలను అందజేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన వసతులను సమకూర్చాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భద్రత పెన్షన్ ఎంతో ఉపయోగకరం

• ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పెన్షన్ మంజూరు ఉత్తర్వుల పంపిణీ



(తానూర్, సాక్షర) అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, ఒంటరి మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రత పెన్షన్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు.తానూర్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ చేతుల మీదుగా నూతన చేయూత పెన్షన్ మంజూరు ఉత్తర్వుల పంపిణీ చేయడం జరిగింది.అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, ఒంటరి మహిళలు, అర్హత కలిగిన వారికి ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రత పెన్షన్ ఎంతో ఉపయోగపడుతుందని వారు అన్నారు. పెద్దలు, వృద్ధులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్, ఎంఆర్ఓ మహేందర్, బీజేపీ కార్యకర్తలు, సర్పంచులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు బజార్ హత్నూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ఎంపిక



(బజార్ హత్నూర్: సాక్షర): మంచిర్యాల జిల్లా మందమర్రి లో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 నెట్‌బాల్ క్రీడా పోటీలలో ఆదిలాబాద్ జట్టు ద్వితీయ స్థానం సాధించి సత్తా చాటింది. ఈ పోటీలలో బజార్ హత్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన నలుగురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, త్వరలో జరగనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు.రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి. పి. ప్రీతి (10వ తరగతి), యం. ఉజ్వల (10వ తరగతి), యం. పవన్ (10వ తరగతి), సీహెచ్. రవి (9వ తరగతి) ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జే భూమన్న, ఉపాధ్యాయ బృందం ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. విద్యార్థుల విజయంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా విద్యార్థులు మరింత మెరుగైన ప్రతిభ కనబరిచి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులను గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.

ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

• జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



(మంచిర్యాల ప్రతినిధి, సాక్షర) జిల్లాలో వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు తో కలిసి పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా శాఖల అధికారులు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ సీజన్‌కు సంబంధించి 289 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించడం జరిగిందని, పి.సి.ఎస్.ఎ.పి. మార్గదర్శకాల ప్రకారం కొనుగోలు కేంద్రాలలో పూర్తి చేయవలసిన 16 ప్రశ్నలకు సంబంధించి ఇప్పటి వరకు 175 కేంద్రాలలో నమోదు పూర్తయిందని, మిగిలిన కేంద్రాలలోనూ వెంటనే ప్రక్రియ పూర్తి చేసి కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సీజన్‌లో జిల్లాలో సుమారు 1 లక్ష 78 వేల 628 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరుగుతాయని అంచనా వేయగా, గోదాములతో సహా జిల్లాలో మొత్తం 1 లక్ష 74 వేల 550 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం అందుబాటులో ఉందని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన గన్నీ సంచులు, టార్పాలిన్లు, ప్యాడీ డ్రైయర్లు, ఆటోమేటెడ్ ప్యాడీ క్లీనర్లు, తేమ శాతం కొలిచే యంత్రాలు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, కాలిపర్స్, హస్క్ రిమూవర్లు తదితర అన్ని మౌలిక సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, ధాన్యం నిల్వలకు తగిన ఏర్పాట్లు ఉన్నాయని తెలిపారు. ధాన్యం మిల్లింగ్ కోసం జిల్లాలో 33 రైస్ మిల్లులను గుర్తించడం జరిగిందని, వీటిలో 14 బాయిల్డ్ రైస్ మిల్లులు, 19 రా రైస్ మిల్లులు ఉన్నాయని, వీటి మొత్తం మిల్లింగ్ సామర్థ్యం 1 లక్ష 46 వేల 750 మెట్రిక్ టన్నులుగా ఉందని తెలిపారు. ఇంకా బ్యాంకు గ్యారంటీలు సమర్పించని రైస్ మిల్లర్లు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రాబోయే యాసంగి సీజన్‌లో వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించేలా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. బహిరంగ మార్కెట్‌లో సన్నబియ్యం ధరలను నియంత్రణలో ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, ఎల్‌డిఎం తిరుపతి, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రోస్టర్ పాయింట్ రిజర్వేషన్ విధానంలో అనుబంధ కులాలకు తీవ్ర అన్యాయం

• ప్రభుత్వ వర్గీకరణను తీవ్రంగా ఖండిస్తున్నాం

(ఆదిలాబాద్, సాక్షర) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కులాలను వర్గీకరించడంలో కేటగిరి మూడులో ఉన్న కులాలకు తీవ్రమైన అన్యాయం చేసిందని సన్నాహక సమావేశంలో పలువురు వక్తలు తీవ్రంగా ఖండించారు."తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కులాలను వర్గీకరించడంలో కేటగిరి మూడులో ఉన్న కులాలకు తీవ్రమైన అన్యాయం చేసినట్లు బుధవారం అత్యవసరంగా ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో పలువురు వక్తలు తీవ్రంగా ఖండించారు.సుప్రీంకోర్టు ఇచ్చిన గైడ్ లైన్స్ ఆధారంగా వర్గీకరణ చేయాల్సింది పోయి, అశాస్త్రీయంగా, రాజ్యాంగానికి విరుద్ధంగా వర్గీకరణ చేయడాన్ని వారందరూ కూడా తీవ్రంగా ఖండించారు.ముఖ్యంగా రోస్టర్ పాయింట్ రిజర్వేషన్ విధానంలో మాల, మహర్, నేతకాని అనుబంధ కులాలకు తీవ్రమైన అన్యాయం జరిగినట్లు సమావేశంలో కోడీకరించారు.వర్గీకరణలో 1 నుంచి 20 వరకు రోస్టర్ లో కేటగిరి - 3 వాళ్లకు ప్రాతినిధ్యం లేకుండా చేయడాన్ని మేము ఏ మాత్రం జీర్ణించుకోలేకపోతున్నామని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి 20 రోస్టర్ పాయింట్లలోనే మా కులాలకు చోటు లేకుండా చేయడం అంటే, ఉద్యోగాలు, నియామకాలలో మమ్మల్ని పూర్తిగా దూరం పెట్టడమే అని, ఇది సామాజిక న్యాయానికి పూర్తి విరుద్ధమని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రికి విజ్ఞప్తి - చట్టాన్ని సవరించాలి, మెమో 1628 ను రద్దు చేయాలి :ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాలోచన చేసి, ఏ చట్టాన్ని అయితే తీసుకొచ్చారో దాన్ని వెంటనే సవరించాలని ఈ సమావేశం ద్వారా కోరుకుంటున్నాము.అలాగే 1628 మెమోను కూడా వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాము. ఈ మెమో వల్ల కేటగిరి - 3 కులాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, దీనిని కొనసాగించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని వక్తలు పేర్కొన్నారు.లేని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం :ప్రభుత్వం మా డిమాండ్లను పట్టించుకోని పక్షంలో, రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైనటువంటి ఉద్యమాన్ని, ఆందోళనను చేపడతామని ఈ సమావేశంలో తీర్మానించారు. రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్యబద్ధంగా మా హక్కుల కోసం చివరి వరకు పోరాడుతామని స్పష్టం చేశారు.నవంబర్ 26 - రాజ్యాంగ దినోత్సవం :ఈనెల నవంబర్ 26వ తారీఖున రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. రాజ్యాంగ ఫలాలు పొందే ప్రతి ఒక్కరు కూడా దీనిలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.డిసెంబర్ 6 - డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతి :డిసెంబర్ 6న బోధిసత్వ భీమ్రావ్ రామ్జీ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని కూడా ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞకుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మధు బావాల్కర్, మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భీమ్రావు వాగ్మారె, దాదాసాహెబ్ జబాడే, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి సోగల సుదర్శన్, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి గుల్షన్ బన్సోడె, కేంద్రీయ శిక్షక్ కాంతరావు వాగ్మారె, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు ఖుశ్వర్త లండ్గే, మాజీ జిల్లా అధ్యక్షుడు దయానంద్ కంబ్లె, ఆర్.పి.ఐ. జిల్లా అధ్యక్షుడు సందీప్ దండ్గే, రమాబాయి అంబేద్కర్ మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు అనిత కంబ్లె, జిల్లా ప్రధాన కార్యదర్శి సులోచన జాబాడే, గౌరవ అధ్యక్షురాలు మాయవాతి ససానే, కోశాధ్యక్షురాలు ఉజ్వల ధుడే, కాంగ్రెస్ పార్టీ ఎస్.సి డిపార్ట్మెంట్ జిల్లా చైర్మన్ కోలేట్కార్ పరమేశ్వర్, ఇంద్రవెల్లి మండల అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు సొంకాంబ్లె జితేందర్, బి.జె.పి దళిత్ మోర్చా స్టేట్ ఉపాధ్యక్షుడు వాగ్మారె శైలెందర్, మాల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు రాఘవేంద్ర, బొబ్బిలి సుధాకర్, రఘు, మొట్ట కిరణ్, సింగరి అశోక్, నేతకాని మహర్ జిల్లా నాయకుడు జాడి ప్రహ్లాద్ తో పాటు సుధాకర్ దుర్గే, సోమన్న ఘులే, బాజీరావు హన్వాతే, భీంరావ్ గజభారే, అనిల్ సాడ్వే, తుకరం జీవినే, రవీందర్ జీవినే, రత్నజాడే ఉదయకుమార్, రాజు మాస్కే, రాజు పటాడే తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్ లో 60 మంది ప్రభుత్వ ఉద్యోగులు

(హైదరాబాద్, సాక్షర): తెలంగాణలో అవినీతి కేసుల్లో అరెస్టయి ప్రస్తుతం దాదాపు 60 మంది ప్రభుత్వ ఉద్యోగులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నట్లు సమాచారం. చంచల్‌గూడ జైలులోనే సుమారు 35 మంది ఉండగా, 2025 అక్టోబర్ నుంచి 2026 జూన్ వరకు 107 మంది అధికారులు జైలుకు వెళ్లారు. మరోవైపు ప్రభుత్వ అనుమతి నిరాకరణతో 2023 నుంచి ఇప్పటివరకు 23 కేసులను ఏసీబీ మూసివేసింది. అవినీతి నిరోధక చర్యలు, కేసుల మూసివేత రెండూ చర్చనీయాంశంగా మారాయి.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత అవినీతి ఆరోపణలతో జైళ్లలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య గరిష్ఠ స్థాయికి చేరినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దాదాపు 60 మంది ప్రభుత్వ ఉద్యోగులు న్యాయస్థానాల ఆదేశాలతో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులోనే సుమారు 35 మంది ప్రభుత్వ సిబ్బంది ఉండగా.. వీరిలో ఎక్కువ మంది ఉన్నతాధికారులే ఉన్నట్లు సమాచారం. మిగిలిన వారు ఖమ్మం, కరీంనగర్ జైళ్లలో ఉన్నారు. పోలీస్, ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు అవినీతి కేసుల్లో అరెస్టవడం ప్రభుత్వ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.ఇటీవలి కాలంలో అవినీతి నిరోధక శాఖ చేపట్టిన దాడుల్లో పలువురు కీలక అధికారులు పట్టుబడ్డారు. నాగర్‌కర్నూల్ ఇరిగేషన్ అండ్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్. సత్యనారాయణ, రోడ్లు భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ మోహన్ నాయక్, హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బి. రవీందర్, నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీ భాస్కర్, మొయినాబాద్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి గుండు వాణి, కీసర ఇన్‌స్పెక్టర్ అంజనేయులు, ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డి తదితరులు ఏసీబీకి పట్టుబడిన వారిలో ఉన్నారు. ఉన్నత స్థాయి అధికారులపై కూడా చర్యలు తీసుకుంటుండటంతో అవినీతి కేసుల్లో అరెస్టుల సంఖ్య పెరుగుతున్నట్లు తెలుస్తోంది.2025 అక్టోబర్ నుంచి ఏసీబీ అవినీతి అధికారులపై చర్యలను ముమ్మరం చేయడంతో జైళ్లలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. 2025 అక్టోబర్ నుంచి 2026 జూన్ వరకు మొత్తం 107 మంది ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు జైలుకు వెళ్లినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వీరిలో 95 మంది ట్రాప్ కేసులకు సంబంధించినవారు. అంటే లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న వారే అధికంగా ఉన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆదాయానికి మించిన ఆస్తుల (డీఏ) కేసుల నమోదు చాలా తక్కువగా ఉండేదని, ట్రాప్ కేసుల్లోనూ కింది స్థాయి ఉద్యోగులే ఎక్కువగా పట్టుబడేవారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే 2024 తర్వాత ఏసీబీ పనితీరులో మార్పు వచ్చిందని 2025 నుంచి అవినీతి అధికారులపై దర్యాప్తులు, దాడులు మరింత విస్తృతమయ్యాయని చెబుతున్నాయి. రాష్ట్ర ఏర్పాటు తర్వాత జైళ్లలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగుల సంఖ్య ఇదే అత్యధికమని జైళ్ల శాఖ వర్గాలు వెల్లడించినట్లు సమాచారం.ఒకవైపు అవినీతి అధికారులపై ఏసీబీ అరెస్టులు కొనసాగుతుండగా.. మరోవైపు ప్రభుత్వ అనుమతి లభించకపోవడంతో పలు కేసులు మూసివేతకు గురవుతున్నాయి. 2023 నుంచి ఇప్పటివరకు వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులపై నమోదైన 20కి పైగా అవినీతి కేసులను ఏసీబీ మూసివేసింది. తాజాగా నవంబర్ మొదటి వారంలో మరో పోలీసు అధికారికి సంబంధించిన ఎఫ్ఐఆర్‌ను మూసివేసేందుకు ప్రత్యేక కోర్టు అనుమతి ఇవ్వడంతో ఈ సంఖ్య 23కు చేరింది. మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీరాజ్ తదితర శాఖలకు చెందిన అధికారులపై నమోదైన ట్రాప్, ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు ఈ జాబితాలో ఉన్నాయి. అవినీతి నిరోధక చట్టం కింద విచారణ అనంతరం అభియోగాలు నమోదు చేసేందుకు అవసరమైన ప్రభుత్వ అనుమతి లభించకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది.తాజాగా మూసివేసిన కేసు హైదరాబాద్‌లోని ఓ పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన ఎస్ఐకి సంబంధించినది. 2023 జనవరి 13న ఫిర్యాదుదారుడి కుమారుడిపై నమోదైన మోసం కేసు నుంచి తప్పించడంతోపాటు, అతడి సెల్‌ఫోన్ తిరిగి ఇప్పించేందుకు రూ.8 వేలు లంచం డిమాండ్ చేసి తీసుకున్న సమయంలో ఏసీబీ అధికారులు సదరు ఎస్ఐని పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తు పూర్తిచేసిన అనంతరం 2023 సెప్టెంబర్ 21న అభియోగాలు నమోదు చేసేందుకు ప్రభుత్వ అనుమతి కోరుతూ ఏసీబీ నివేదిక పంపింది.అయితే ప్రభుత్వం ఈ కేసులో ప్రాసిక్యూషన్‌కు అనుమతి నిరాకరించింది. 2026 జనవరి 27న జారీ చేసిన జీవో ఆర్టీ నంబర్ 88 ద్వారా ఏసీబీ డైరెక్టర్ జనరల్ సిఫారసులతో విభేదించింది. ప్రాసిక్యూషన్‌కు అవసరమైన స్థాయిలో ఆధారాలు లేవని, కేసు విచారణకు తగినది కాదని పేర్కొంటూ క్రిమినల్ చర్యలకు బదులుగా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అనంతరం మార్చి 10న ఏసీబీ డీజీ దర్యాప్తు అధికారికి ఎఫ్ఐఆర్ మూసివేత కోసం ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని సూచించారు. సెప్టెంబర్ 11న కోర్టుకు హాజరైన ఫిర్యాదుదారుడు తుది నివేదికపై తనకు అభ్యంతరం లేదని తెలిపాడు. దీంతో నవంబర్ 2న ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం కేసు మూసివేతకు సంబంధించిన తుది నివేదికను అంగీకరించి విచారణను ముగించింది. ఇలా ఒకవైపు అవినీతి అధికారులపై ఏసీబీ దాడులు, అరెస్టులు కొనసాగుతుండగా.. మరోవైపు ప్రభుత్వ అనుమతుల కారణంగా కేసుల మూసివేత కూడా చర్చకు దారితీస్తోంది.

ఉద్యాన పంటల సాగుతో రైతులకు నిరంతర ఆదాయం



• తక్కువ నీటితో అధిక ఆదాయం ఇచ్చే పంటలను ప్రోత్సహించాలి ఐటీడీఏ పీఓ మంద మకరందు

(ఉట్నూర్, సాక్షర) గిరిజన రైతులు ఉద్యాన పంటల సాగు చేపట్టి ఏడాది పొడవునా స్థిరమైన ఆదాయం పొందేలా ప్రోత్సహించాలని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు అధికారులను ఆదేశించారు.బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఉద్యాన శాఖ నర్సరీని సందర్శించిన ఆయన షేడ్ నెట్, నెట్‌హౌస్‌లలో సాగు చేస్తున్న మునగ, వెదురు, కరోండా, డ్రాగన్ ఫ్రూట్ తదితర మొక్కలను పరిశీలించారు. ఐటీడీఏ, గ్రామీణాభివృద్ధి, ఉద్యాన శాఖల సమన్వయంతో గిరిజన రైతులకు షేడ్ నెట్‌లు అందించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని జిల్లా ఉద్యానవన అధికారి గుడిమల్ల సందీప్ కుమార్‌కు సూచించారు.మామిడి తోటలో అంతర పంటగా సాగు చేస్తున్న టమాటా పంటను పరిశీలించి, అంతర పంటల సాగుతో రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా తక్కువ నీటితో అధిక ఆదాయం అందించే ఆయిల్ పామ్, కూరగాయలు, మల్బరీ తదితర పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.గిరిజన రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై శిక్షణ అందిస్తూ, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారిణి అలేఖ్య, సిబ్బంది పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ సోదాలపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు..

• డీజీపీ, హోంశాఖకు నోటీసులు

హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు చట్టబద్ధమైన నిబంధనలు పాటించకుండా సోదాలు, తనిఖీలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలపై తెలంగాణ హైకోర్టు స్పందించింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ మాధవి దేవి... రాష్ట్ర హోంశాఖ, డీజీపీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, టాస్క్‌ఫోర్స్ డీసీపీలకు నోటీసులు జారీ చేశారు. ఈ ఆరోపణలపై పూర్తి వివరణ ఇవ్వాలని ఆదేశించారు.బోరబండ ప్రాంతానికి చెందిన బి. బాలరాజ్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పోలీసు యూనిఫాం ధరించకుండా, సాధారణ పౌర దుస్తుల్లో వచ్చి తనిఖీలు, సోదాలు నిర్వహిస్తున్నారని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే సోదాలు చేయడం, వస్తువులను స్వాధీనం చేసుకోవడం చట్టవిరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు.పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... ఎఫ్ఐఆర్ నమోదు చేయకముందే ఏకపక్షంగా దర్యాప్తు చేపట్టడం బీఎన్ఎస్ఎస్ 2023 నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. సంబంధిత వ్యక్తులకు తమ వాదన వినిపించే అవకాశం ఇవ్వకుండా, పారదర్శకత లేకుండా వ్యవహరిస్తున్నారని వాదించారు. అలాగే సెర్చ్ వారెంట్లు జారీ చేసే అధికారం కేవలం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌లకు మాత్రమే ఉంటుందని... ఏసీపీ స్థాయి అధికారులు సెర్చ్ వారెంట్లు జారీ చేయడం చట్టబద్ధం కాదని స్పష్టం చేశారు.ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి, పిటిషనర్ లేవనెత్తిన అంశాలపై సమగ్ర వివరణ ఇవ్వాలని ప్రతివాదులను ఆదేశిస్తూ విచారణను డిసెంబరు నెలకు వాయిదా వేశారు. టాస్క్‌ఫోర్స్ పనితీరుపై హైకోర్టు నోటీసులు జారీ చేయడం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం ఆసరా



(జన్నారం, సాక్షర): తెలంగాణ రాష్ట్రంలోని పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం నిరంతరం ఆసరాగా ఉంటుందని ఖానాపూర్ శాసనసభ్యుడు వెడ్మ బోజ్జు పటేల్ అన్నారు.బుధవారం మండల కేంద్రంలో పోనకల్ రైతు వేదికలో మండల పరిషత్ అధికారులు ఏర్పాటు చేసిన నూతన ఆసరా పెన్షన్ పత్రాల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన అర్హులైన 785 మంది పేదలకు ధ్రువపత్రాలను అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం నిరంతరం రాష్ట్ర ప్రజల అభివృద్ధికి, రాష్ట్రాన్ని దేశంలోనే అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడానికి అహర్నిశలు కృషి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పోనకల్, చింతగూడ ప్యాక్స్ చైర్మన్లు అల్లం రవి, నాసాని రాజన్న, జన్నారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ ఫసివుల్లా, పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు అజ్మీరా నందునాయక్, మేకల మాణిక్యం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉమర్ షరీఫ్, మండల తహసిల్దార్ బక్కయ్య, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, పార్టీ జిల్లా, మండల నాయకులు జక్కు భూమేష్, ముత్యం సతీష్, ముత్యం రాజన్న తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు సకాలంలో టీకాలు అందించాలి



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): దస్నాపూర్ సబ్ సెంటర్ పరిధిలోని ధోబి కాలనీ అంగన్వాడి సెంటర్‌లో ఇమ్యునైజేషన్ సెషన్ నిర్వహించినట్లు ఆరోగ్య సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో అంకోలి హెల్త్ సూపర్‌వైజర్ బొమ్మెత సుభాష్, వాకాడే పూనమ్ ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎం ముంతాజ్ బేగం, అంగన్వాడి టీచర్, ఆశా కార్యకర్తలు కుంటాల అనిత, నర్మద, కుంటాల భారతి, గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు పాల్గొన్నారు.

ఈనెల 21న స్పెషల్ లోక్ అదాలత్ జడ్జి పర్వతపు రవి



(చెన్నూర్, సాక్షర): చెన్నూర్ పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ప్రాంగణంలో ఈ నెల నవంబర్ 21న నిర్వహించబోయే స్పెషల్ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి పర్వతపు రవి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో కోర్టు ప్రాంగణంలో న్యాయవాదుల సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం అందించే మార్గాలపై ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న చెక్ బౌన్స్ కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బార్ అసోసియేషన్ సభ్యులకు జడ్జి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కక్షిదారులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాజీమార్గం ద్వారా తమ కేసులను పరిష్కరించుకునేలా న్యాయవాదులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీందర్, స్పెషల్ పీపీ పోక్సో కోర్టు రాంబావ్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ లాయర్ పి. మల్లేశం, బార్ కౌన్సిల్ సభ్యులు / న్యాయవాదులు కె. మహేష్, ఎస్. రమేష్, బి. రాజేష్, రాజశేఖర్, లక్ష్మణ్, కె. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

- అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ
- అర్హుల గుర్తింపునకు ప్రత్యేక కార్యాచరణ
- జిల్లా కలెక్టర్ కె. హరిత, ఐ.ఎ.ఎస్

(ఆసిఫాబాద్ ప్రతినిధి, సాక్షర): రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించి, కుటుంబ పెద్దను కోల్పోయిన సందర్భంలో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా అండగా నిలవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు.కుటుంబంలో ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న వ్యక్తి అనుకోకుండా మరణించినప్పుడు ఆ కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులను తగ్గించి, వారి జీవన భద్రతకు భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు 5 లక్షల రూపాయల జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు వారికి అర్హత... ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన అర్హులైన వ్యక్తులు అర్హత పొందుతారని తెలిపారు. లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియలో రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకొని కుటుంబ వివరాలను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. జనాభా లెక్కల సేకరణ వివరాలు పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందని, ఒకవేళ రేషన్ కార్డు లేకపోతే ఆధార్ కార్డు ఆధారంగా వివరాలు సేకరించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. 335 గ్రామపంచాయతీలు, 2 మున్సిపాలిటీల పరిధిలో ప్రత్యేక కార్యాచరణ జిల్లాలోని 335 గ్రామపంచాయతీలు, 2 మున్సిపాలిటీల పరిధిలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో గ్రామపంచాయతీల వారీగా, పట్టణ ప్రాంతాలలో మున్సిపల్ వార్డుల వారీగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారి వివరాలను సేకరించడం జరుగుతుందని తెలిపారు. జనాభా, వార్డులు/గ్రామపంచాయతీల సంఖ్య ఆధారంగా శిబిరాలు నిర్వహించి లబ్ధిదారుల వివరాలు, సంతకంతో కూడిన దరఖాస్తు పత్రాలను స్కాన్ చేసి సంబంధిత బీమా సంస్థకు సమర్పించడం జరుగుతుందని తెలిపారు. అధికారులు లబ్ధిదారుల వివరాలు సేకరించిన తర్వాత ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందని, ఈ పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని వివరాలు అందించవలసి ఉంటుందని తెలిపారు. కార్యచరణ ప్రణాళికలో భాగంగా లబ్ధిదారులకు ఇందిరమ్మ కుటుంబ బీమా పథకంలో చోటు కల్పించడం జరుగుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల అధికారులు, పట్టణ ప్రాంతాలలో మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అర్హుల వివరాల సేకరణ, పరిశీలన ప్రక్రియను చేపట్టాలని సూచించారు. ప్రత్యేక శిబిరాల ద్వారా ప్రజలకు పథకంపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన వారి వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. వివరాల నమోదు... ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ కుటుంబ బీమా పథకంలో వివరాల నమోదు ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని, మొదట జిల్లా పేరు, ఆ తర్వాత మున్సిపాలిటి, మండలం, గ్రామం, వార్డు పేర్లను నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకంలో వర్తించే బీమాదారునిగా కుటుంబపెద్ద పోషకుడు, తండ్రి / భర్త పేరు నమోదు చేసి కుటుంబసభ్యుల పేర్లు, బంధుత్వం వివరాలు నమోదు చేయవలసి ఉంటుందని, భవిష్యత్తులో బీమా మొత్తం చెల్లించేందుకు వీలుగా నామినీ పేరు, ప్రతిపాదకులు నియమించిన వ్యక్తి బీమాదారులతో ఉన్న సంబంధం, ఆధార్ సంతకం, చివరగా అధికారిక సంతకం ప్రక్రియతో లబ్ధిదారుని సంతకాన్ని కంప్యూటర్ లో నిక్షిప్తం చేస్తారని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాలి జిల్లాలోని మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలలో నివసించే అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకం ప్రయోజనాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రజలకు పథకం అర్హతలు, అవసరమైన వివరాలపై అవగాహన కల్పించాలని, అర్హుల గుర్తింపు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హుల వివరాల సేకరణ, పరిశీలన ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పిస్తూ, అనుకోని ఆపద సమయంలో వారికి అండగా నిలిచే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా అధికారులు బాధ్యతతో పని చేయాలని తెలిపారు.

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి



- సీపీఐ జిల్లా కన్వీనర్ ఎస్. విలాస్

(తలమడుగు, సాక్షర) తలమడుగు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, వెంటనే కరువు పనులు చేపట్టాలని సీపీఐ జిల్లా కన్వీనర్ ఎస్. విలాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో తలమడుగు మండలంలోని కూచులపూర్, సాయిలింగి లాలగడ, లక్ష్మీపూర్, మల్లేపల్లి, తలమడుగు గ్రామాల్లో సీపీఐ శాఖల సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు సీపీఐ జిల్లా కన్వీనర్ ఎస్. విలాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.జిల్లా వ్యాప్తంగా ఎల్నినో ప్రభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తలమడుగు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని, నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేల చొప్పున పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించడంతో పాటు పశువులకు మేత అందించాలని, రైతుల బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని కోరారు.అలాగే కూచులపూర్ - లల్గాడ కనెక్టింగ్ రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేయాలని, ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు రహదారిపై ఏర్పడిన గుంతలను తొలగించి నూతన రహదారి నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు.సీపీఐ దేశ స్వాతంత్ర్య పోరాటంలో, హైదరాబాద్ రాష్ట్ర విముక్తి ఉద్యమంలో కీలక పాత్ర పోషించి ఎన్నో త్యాగాలు చేసిందని ఆయన పేర్కొన్నారు. కూచులపూర్కు చెందిన దాజీ శంకర్ జిల్లాలో సీపీఐ స్థాపనలో ముఖ్య పాత్ర పోషించడంతో పాటు సాయుధ పోరాటంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీజేపీకి కౌంట్డౌన్ మొదలైందని ఆయన వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో చిల్క దేవిదాస్, మాచర్ల శ్రీనివాస్, కిషన్ రావు, భీం రావు పటేల్, ఇప్ప శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంగాపూర్ బాలాజీ ఆలయం వద్ద అదనపు మరుగుదొడ్ల నిర్మాణం



(రెబ్బెన,సాక్షర): గంగాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద భక్తుల సౌకర్యార్థం 6లక్షల వ్యయంతో వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్)విబి-జి రామ్ జీ పథకంలో భాగంగా చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణానికి బుధవారం గంగాపూర్ సర్పంచ్ వెంకటేశం చారి భూమి పూజ చేశారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ లెండుగురే ఇస్తారి,వార్డు సభ్యులు లెండుగురే తిరుపతి,దుర్గం వెంకట్,రాజేష్ బీజేపీ నాయకులు ఇగురపు సంజీవ్,ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి చేనులో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

- పత్తి పంట మధ్య ఎవరికీ తెలియకుండా 12 గంజాయి మొక్కల సాగు గంజాయి సాగు, విక్రయాలు, అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు – బోథ్ సీఐ డి. సాయినాథ్

(బోథ్, సాక్షర) ఈ నెల 6వ తేదీన బోథ్ మండలం సాంగ్వి గ్రామ శివారులోని వ్యవసాయ భూముల్లో పత్తి పంట మధ్య అంతర పంటగా అక్రమంగా సాగు చేస్తున్న 12 గంజాయి మొక్కలను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో గంజాయి సాగు చేసిన పెందూరు శంభు పరారీలో ఉండగా, పోలీసులు ప్రత్యేకంగా గాలించి బుధవారం అదుపులోకి తీసుకున్నారు.నిందితుడిని విచారించగా, తనకు గంజాయి సేవించే అలవాటు ఉండటంతో గంజాయి నుంచి సేకరించిన విత్తనాలను ఉపయోగించి డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఎవరికీ తెలియకుండా పత్తి చేనులో గంజాయి సాగు చేసినట్లు విచారణలో వెల్లడైంది. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించినట్లు బోథ్ సీఐ డి. సాయినాథ్ తెలిపారు.ఈ సందర్భంగా బోథ్ సీఐ డి. సాయినాథ్ మాట్లాడుతూ, గంజాయి సాగు చేయడం, వినియోగించడం, విక్రయించడం, అక్రమ రవాణాకు పాల్పడటం చట్టరీత్యా నేరమని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా గంజాయి సాగు చేస్తున్నట్లు లేదా విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ కార్యకలాపాలపై పోలీసుల నిరంతర నిఘా కొనసాగుతుందని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో బోథ్ ఎస్ఐ వి. పురుషోత్తం, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్షణా? వేధింపులా?.. పనితీరుపై ప్రశ్నలు!

ప్రజలకు రక్షణ కల్పించాల్సిన వ్యవస్థే భయానికి కారణమైతే సామాన్యుడు న్యాయం కోసం ఎవరిని ఆశ్రయించాలి? ఫిర్యాదు స్వీకరించి న్యాయం చేయాల్సిన అధికారులపైనే లంచం డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు వస్తే బాధితుడి పరిస్థితి ఏమిటి? నేరాలను అరికట్టాల్సిన పోలీసు శాఖలో అవినీతి, అధికార దుర్వినియోగం, అంతర్గత విభేదాల ఆరోపణలు వెలుగుచూడటం ఆందోళన కలిగించే అంశం. హైదరాబాద్ కేబీఆర్ పార్కు సమీపంలో పర్యావరణ కార్యకర్తల అరెస్టులపై జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పందన, యాపల్గూడ ప్రత్యేక పోలీసు బెటాలియన్లో వివాదం, రిమ్స్లో చికిత్స అనంతరం రాహుల్ కాంబ్లే మృతి, ఆదిలాబాద్ బజార్హత్నూర్లో ఎస్ఐ ఏసీబీకి పట్టుబడిన ఘటన.. ఒక్కో పరిణామం ఒక్కో ప్రశ్నను ముందుకు తెస్తోంది. మరోవైపు, నవంబర్ 12న రాష్ట్ర ప్రభుత్వం 21 మంది ఐపీఎస్ అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించింది. అయితే బదిలీలను, ఏసీబీ దాడులను, వివిధ ఫిర్యాదులను ఒకే కోణంలో చూడలేం. ప్రతి ఘటనకు ప్రత్యేక నేపథ్యం ఉంటుంది. ఆరోపణలు విచారణలో నిర్ధారణ కావాలి. అయినప్పటికీ ప్రజల ముందున్న ప్రశ్న ఒక్కటే. చట్టాన్ని అమలు చేసే అధికారులే చట్టపరమైన హద్దులు దాటితే సామాన్యుడికి భరోసా కల్పించేది ఎవరు.

చట్టబద్ధతపై ప్రశ్నలు.. హైదరాబాద్ నుంచి!

హైదరాబాద్ కేబీఆర్ పార్కు పరిసరాల్లో చెట్ల తొలగింపును వ్యతిరేకిస్తూ మే 13న నిరసన తెలిపిన ఐదుగురు పర్యావరణ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ మే 20న స్వయంగా విచారణకు స్వీకరించింది. తెలంగాణ డీజీపీ, హైదరాబాద్ జిల్లా మేజిస్ట్రేట్కు నోటీసులు జారీ చేసి నివేదిక కోరింది. వార్తల్లో వచ్చిన ఆరోపణలు నిజమైతే మానవ హక్కుల ఉల్లంఘన అంశాలు తలెత్తవచ్చని కమిషన్ పేర్కొంది. ఇది తుది నిర్ధారణ కాదు. అధికారుల వివరణ కోరిన ప్రాథమిక చర్య మాత్రమే. మరోవైపు తెలంగాణ హైకోర్టు జూన్ 10న ఒక నిర్దిష్ట రౌడీషీట్ నిర్వహణలో సరైన సమీక్ష జరగలేదని గుర్తించి దాన్ని మూసివేయాలని ఆదేశించింది. అన్ని రౌడీషీట్లనూ తప్పుబట్టినట్లు ఈ ఉత్తర్వులను అర్థం చేసుకోరాదు. చట్టం నిర్దేశించిన విధానాలు, ఆధారాలు, సమీక్ష ప్రక్రియ పాటించాల్సిందేనన్నది ఇందులోని ప్రధాన అంశం. ప్రజా నిరసనలను నియంత్రించడం పోలీసుల విధి అయినా, ఆ చర్యలు చట్టపరిధిలోనే ఉండాలి.

బెటాలియన్లో వివాదం.. అంతర్గత పర్యవేక్షణ ఏది?

ఆదిలాబాద్ జిల్లా యాపల్గూడ రెండో తెలంగాణ ప్రత్యేక పోలీసు బెటాలియన్లో చోటుచేసుకున్న పరిణామాలు శాఖలో అంతర్గత పర్యవేక్షణ అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి. సెప్టెంబర్ 25న రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ రసం రాకేశ్ ఫిర్యాదు మేరకు రిజర్వ్ ఇన్స్పెక్టర్ నరేశ్పై హత్యాయత్నం కేసు నమోదైంది. జీపుతో ఢీకొట్టిన ఘటనలో రాకేశ్ గాయపడినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. బెటాలియన్లో బదిలీలు, విధుల కేటాయింపు, నిర్మాణ పనులు, ఇంధన వినియోగం, మందుల కొనుగోళ్లు, సంక్షేమ కార్యక్రమాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు కూడా వెలువడ్డాయి. అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినందుకే కక్ష పెంచుకున్నారన్న వాదనలూ ఉన్నాయి. అక్టోబర్ 30న ఇద్దరు ఇన్స్పెక్టర్లను సస్పెండ్ చేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే సస్పెన్షన్ నేర నిర్ధారణ కాదు. ఆరోపణలన్నింటిపైనా స్వతంత్రంగా, పారదర్శకంగా విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలి. బెటాలియన్లో పనిచేసే సిబ్బందికి ఫిర్యాదు చేసే స్వేచ్ఛ, భద్రత కల్పించడమూ ఉన్నతాధికారుల బాధ్యతే.

రిమ్స్ ఘటన.. యువకుడి మృతిపై సమగ్ర విచారణ!

అక్టోబర్ 29న రాహుల్ కాంబ్లే మృతి మరో తీవ్ర చర్చకు దారితీసింది. తేలు కుట్టడంతో చికిత్స కోసం రిమ్స్కు వెళ్లిన రాహుల్ అక్కడి వైద్య సేవలపై మొబైల్లో వీడియో తీసినట్లు వార్తా కథనాలు తెలిపాయి. ఈ క్రమంలో వైద్య సిబ్బందితో వాగ్వాదం జరిగిందని, పోలీసులు ఆయనను పోలీస్స్టేషన్కు తీసుకెళ్లి అనంతరం తండ్రికి అప్పగించారని పోలీసుల వివరణగా వార్తలు వెల్లడించాయి. ఇంటికి వెళ్లిన తర్వాత రాహుల్ ఆత్మహత్య చేసుకున్నట్లు కథనాలు పేర్కొన్నాయి. సూసైడ్ నోట్లో వైద్య సిబ్బంది, పోలీసుల ప్రవర్తనపై ఆరోపణలు చేసినట్లు సమాచారం. మరోవైపు పోలీసులపై చేసిన దాడి ఆరోపణలను అధికారులు ఖండిస్తూ సీసీటీవీ ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నట్లు పీటీఐ కథనం తెలిపింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వైద్య సిబ్బంది, పోలీసు సిబ్బందిపై కేసు నమోదైనట్లు వార్తలు వచ్చాయి. ఇలాంటి ఘటనలో ఆరోపణలే తుది వాస్తవాలుగా మారకూడదు. సీసీటీవీ దృశ్యాలు, వైద్య రికార్డులు, పోలీస్స్టేషన్ వివరాలు, సాక్షుల వాంగ్మూలాలను నిష్పక్షపాతంగా పరిశీలించాలి. బాధిత కుటుంబానికి న్యాయం జరగడంతోపాటు విచారణ చట్టబద్ధంగా సాగాలి.

ఏసీబీ వలలో పోలీసు సిబ్బంది!

పోలీసు శాఖలో అవినీతి ఆరోపణల తీవ్రతను ఇటీవలి ఏసీబీ చర్యలు మరోసారి గుర్తుచేస్తున్నాయి. 2025 అక్టోబర్ 1 నుంచి 2026 జూన్ 9 వరకు తెలంగాణలో 192 అవినీతి కేసులు నమోదయ్యాయి. వాటిలో 95 ట్రాప్ కేసులు, 12 ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు, 23 క్రిమినల్ మిస్కండక్ట్ కేసులు ఉన్నాయి. ఆగస్టు 22న చందానగర్ పోలీస్స్టేషన్కు చెందిన ఎస్ఐ, కానిస్టేబుల్ రూ.75 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. సెప్టెంబర్ 16న కీసర ఎస్ఐ రూ.5 లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడగా, నవంబర్ 9న అదే పోలీస్స్టేషన్కు చెందిన మరో ఎస్ఐ రూ.2 లక్షలు తీసుకుంటూ చిక్కారు. ఈ ఘటనలన్నింటిలోనూ ఏసీబీ ఆరోపణలు, దర్యాప్తు వివరాలే ప్రస్తుతానికి ఆధారం. నేరం నిరూపితమయ్యే వరకు చట్టపరమైన ప్రక్రియ కొనసాగాలి. అవినీతి నిరోధక చర్యలు అరెస్టులతోనే ఆగిపోకుండా కేసుల పరిష్కారం వరకు సాగాలి. నిజాయితీగా పనిచేసే సిబ్బందికి అండగా నిలుస్తూనే, తప్పు నిరూపితమైన వారిపై హోదాతో సంబంధం లేకుండా చర్యలు తీసుకోవాలి.

బదిలీలతోనే మార్పు సాధ్యమా?

నవంబర్ 12న ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఆర్.టి. నంబర్ 1654 ద్వారా 21 మంది ఐపీఎస్ అధికారులకు బదిలీలు, కొత్త బాధ్యతలు కల్పించింది. వీసీ సజ్జనార్ను ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగానికి, మహేశ్ మురళీధర్ భగవత్ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్గా నియమించింది. డాక్టర్ సౌమ్యా మిశ్రాకు మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా విభాగాల బాధ్యతలు, స్వాతి లక్రాకు జైళ్ల శాఖ బాధ్యతలు అప్పగించింది. అకున్ సబర్వాల్కు అదనపు డీజీపీ లా అండ్ ఆర్డర్ బాధ్యతలు, చారు సిన్హాకు ఏసీబీ డీజీ బాధ్యతలు కల్పించింది. ఇవి పరిపాలనా నిర్ణయాలు మాత్రమే. బదిలీల వెనుక శిక్షాత్మక ఉద్దేశాలు ఉన్నాయని ఆధారాలు లేకుండా చెప్పడం సరికాదు. అయితే కొత్త బాధ్యతలు చేపట్టిన అధికారులు ప్రజలకు అందే సేవల్లో మెరుగుదల కనిపించేలా చర్యలు తీసుకోవాలి. పోలీస్స్టేషన్లలో ఫిర్యాదుల స్వీకరణ, దర్యాప్తు నాణ్యత, మహిళలు, పిల్లల భద్రత, బెటాలియన్లలో పర్యవేక్షణ, సిబ్బంది ప్రవర్తనపై నిరంతర సమీక్ష అవసరం. పోలీసు వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపడం అంటే మొత్తం శాఖను కించపరచడం కాదు. ప్రజల కోసం నిబద్ధతతో పనిచేసే సిబ్బంది గౌరవం నిలవాలన్నా, వ్యవస్థపై నమ్మకం పెరగాలన్నా జవాబుదారీతనం అవసరం. బదిలీలు పరిపాలనా మార్పునకు ఆరంభం కావచ్చు. కానీ నిజమైన మార్పు కనిపించేది ప్రజలకు అందే సేవల్లోనే. అధికారం ప్రదర్శించడం కాదు.. న్యాయం చేయడమే పోలీసు వ్యవస్థకు గౌరవం తెస్తుంది. ప్రజలకు భయం కాదు, భరోసా కల్పించినప్పుడే ఖాకీపై విశ్వాసం మరింత బలపడుతుంది.



వ్యాసకర్త: ఎల్లల సంతోష్ కుమార్, ప్రాంతీయ నిర్వహణ కార్యదర్శి తెలంగాణ వినియోగదారుల సంస్థల సమాఖ్య (క్యాట్కో) ఫోన్: 6301044014

పి.ఎం. శ్రీ పాఠశాలల అభివృద్ధికి ఉత్తమ విద్యా విధానాలపై అధ్యయనం చేయాలి



- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

(మంచిర్యాల ప్రతినిధి, సాక్షర) ప్రధానమంత్రి శ్రీ పాఠశాలల సమగ్ర అభివృద్ధి, నాణ్యమైన విద్యాబోధన, ఆధునిక బోధనా పద్ధతులు, ఉత్తమ పాఠశాల నిర్వహణ విధానాలపై అధ్యయనం చేసి అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో జిల్లాకు చెందిన 25 మంది పి.ఎం. శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సంబంధిత కో-ఆర్డినేటర్లతో కూడిన బృందం ఈ నెల 21వ తేదీ వరకు 4 రోజుల విద్యా అధ్యయన పర్యటనలో భాగంగా బెంగళూరు, మైసూరు ప్రాంతాలలోని ప్రముఖ విద్యాసంస్థల సందర్శనకు సంబంధించిన పర్యటన బస్సును జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇన్చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి పి.చంద్రయ్య తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధ్యయన పర్యటనలో భాగంగా బెంగళూరులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్, రీజినల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, మైసూరులోని రీజినల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ తదితర ప్రముఖ విద్యాసంస్థలను బృందం సందర్శిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా విద్యాసంస్థలలో అమలవుతున్న ఆధునిక విద్యాబోధనా పద్ధతులు, పాఠశాల నాయకత్వ లక్షణాలు, విద్యా ప్రణాళికలు, వినూత్న బోధనా విధానాలు, విద్యార్థుల సామర్థ్యాల పెంపుదలతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తారని తెలిపారు. విద్యారంగంలో వస్తున్న నూతన మార్పులు, ఆధునిక బోధనా పద్ధతులు, ఉత్తమ పాఠశాల నిర్వహణ విధానాలపై ఉపాధ్యాయులు నిరంతరం అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ అధ్యయన పర్యటనలో తెలుసుకున్న అంశాలు, పొందిన అనుభవాలు, ఉత్తమ విధానాలను తమ పాఠశాలలలో సమర్థవంతంగా అమలు చేసి, పి.ఎం. శ్రీ పాఠశాలలను ఆదర్శ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, పి.ఎం. శ్రీ పాఠశాలల కో-ఆర్డినేటర్లు, 25 మంది ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

"మేము బీజేపీలోనే ఉన్నాం...



(తానూర్, సాక్షర): సన్మానం పేరిట మమ్మల్ని హైదరాబాద్‌కు తీసుకెళ్లి కేటీఆర్ సమక్షంలో కండువాలు కప్పించడం సరికాదని, మేము బీజేపీలోనే ఉన్నామని తానూర్ మండల సర్పంచులు స్పష్టం చేశారు. మండలంలోని పలు సర్పంచులు మేము బీజేపీలోనే ఉన్నామని ప్రకటించారు. సన్మానం పేరిట తమను హైదరాబాద్‌కు తీసుకెళ్లి కేటీఆర్ సమక్షంలో కండువాలు కప్పించడం సరికాదని, తాము బీజేపీలోనే ఉన్నామని, ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ వెంటే ఉంటామని జోల బి సర్పంచ్ శేషరావు పటేల్, ఉప్పు సర్పంచ్ అంకుష్, తొండాల సర్పంచ్ మీరేకర్ మాధవ అన్నారు.ఉదయం వేళ ఎస్ ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను కలిసి బీజేపీ కండువా కప్పుకుని వారు మాట్లాడారు. సన్మానంకు రమ్మంటే వెళ్లామని, తాము బీఆర్ఎస్‌లో చేరడం అసత్య ప్రచారమని అన్నారు.ఈ సందర్భంగా మండల్ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మాయమాటలు చెప్పి బీజేపీ సర్పంచులను తీసుకెళ్లడం సరికాదన్నారు. ప్రజాక్షేత్రంలో గెలవని వారు, ప్రజల మనసులను పొందని వారు ఇలాంటి కపట నాటకాలు ఆడుతున్నారన్నారు. ఇంకోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే బీజేపీ తరఫున తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.అబద్ధ ప్రచారాలు, మాయ మాటలు ఎప్పుడూ సాగవని, ఇకనైనా తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. సోషల్ మీడియాలో ప్రచారం కోసం, ఆర్భాటాల కోసం ఇలాంటి చర్యలకు ఒడిగడితే తగిన రీతిలో సమాధానం చెప్పాల్సి వస్తుందన్నారు.నియోజకవర్గం అభివృద్ధి ధ్యేయంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ముందుకు సాగుతున్నారన్నారు. నియోజకవర్గంలో వంద మందికి పైగా సర్పంచులను గెలిపించుకున్న చరిత్ర తమ నాయకుడిదేనన్నారు. ప్రజా బలం ముందు, ప్రజల ఆశీర్వాదం ముందు ఎవరి కుట్రలు, కుతంత్రాలు పనిచేయవన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, సర్పంచులు, బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి 5 లక్షల జీవిత బీమా భరోసా



- 19 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు

(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) నిర్మల్: నిర్మల్ పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అధ్యక్షతన పురపాలక సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రతి కుటుంబానికి ఒక భరోసా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి అనుకోని పరిస్థితుల్లో మరణిస్తే, ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ప్రభుత్వం అండగా నిలిచేందుకు ఈ సార్వత్రిక జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి 5 లక్షల జీవిత బీమా ప్రయోజనం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని స్థానిక కౌన్సిలర్లు వార్డు అధికారులతో సమన్వయం చేసుకుంటూ అర్హులైన కుటుంబాలకు పథకంపై అవగాహన కల్పించి,దరఖాస్తు ప్రక్రియలో సహకరించాలని సూచించారు.కుటుంబాన్ని పోషించే 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల సభ్యుడిని బీమా పొందే వ్యక్తిగా పరిగణించనున్న నేపథ్యంలో, వయస్సు ధ్రువీకరణకు ఆధార్ కార్డును ప్రామాణికంగా తీసుకొని, సంబంధిత నిబంధనలను పరిశీలించిన అనంతరం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని సూచించారు.ఈ నెల 19వ తేదీ నుంచి పథకం అమలులోకి రానున్నందున కౌన్సిలర్లు ప్రజలకు, సంబంధిత అధికారులకు అందుబాటులో ఉండి పథకం విజయవంతంగా అమలయ్యేలా కృషి చేయాలని కోరారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకొస్తున్న ఈ పథకం ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత, భరోసా కల్పించే దిశగా కీలక ముందడుగుగా నిలుస్తుందని సమావేశంలో అభిప్రాయపడ్డారు.ఈ సమావేశంలో కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ ఎం. రవి బాబు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో ప్రతి అర్హత కుటుంబానికి ఆర్థిక భరోసా



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర) ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పథకాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. అర్హత కలిగిన ఏ ఒక్క కుటుంబం కూడా పథకం ప్రయోజనానికి దూరం కాకుండా సమగ్ర కార్యాచరణతో నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుపై సమీక్షించారు.ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, కుటుంబంలో సంపాదించే వ్యక్తి ఆకస్మికంగా మరణించినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడమే పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రతి కుటుంబంలో 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన సంపాదించే ఒక వ్యక్తిని బీమా పరిధిలోకి తీసుకోవాలని, కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది సంపాదించే వారు ఉంటే ఎవరిని ఎంపిక చేసుకోవాలనేది కుటుంబ సభ్యులే నిర్ణయించుకునే అవకాశం కల్పించాలని సూచించారు. కుల, మత, ఆదాయ భేదాలు లేకుండా అర్హులందరికీ పథకం ప్రయోజనం అందించాలని, బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని స్పష్టం చేశారు. రేషన్ కార్డుల ఆధారంగా కుటుంబాలను గుర్తించడంతో పాటు రేషన్ కార్డుల్లో పేర్లు లేని వారు, రేషన్ కార్డులు లేని కుటుంబాలకు కూడా ప్రత్యేక దరఖాస్తు విధానం ద్వారా నమోదు అవకాశం కల్పించాలని తెలిపారు. ఆధార్ ఆధారిత పుట్టిన తేదీ, కుటుంబ సభ్యులు, నామినీల వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని, మీ సేవ కేంద్రాల ద్వారా కూడా అవసరమైన సేవలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, జిల్లాలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీల ఆధ్వర్యంలో నమోదు ప్రక్రియ చేపట్టనున్నట్లు వివరించారు. పథకం అమలుపై ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. మండల స్థాయి అధికారులు, వార్డు అధికారులకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రామాణిక కార్యాచరణ విధానంపై (ఎస్ఓపీ) శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. నమోదు ప్రక్రియ వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎంపీడీవోలు, మున్సిపాలిటీలకు ప్రత్యేక లాగిన్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు.జిల్లాలోని ప్రతి నమోదు శిబిరంలో ఇంటర్నెట్ కనెక్షన్, ప్రింటర్, స్కానర్ వంటి సాంకేతిక సదుపాయాలు ఏర్పాటు చేశామని, అన్ని గ్రామాల్లో శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ముందుగా నింపిన దరఖాస్తు ఫారాలను కూడా శిబిరాల్లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు.ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బంది, మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల సమన్వయంతో ప్రతి అర్హ కుటుంబానికి పథకంపై అవగాహన కల్పించి, నమోదు ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఆర్ఎస్ చిత్రు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఐటీడీఏ పీఓ మంద మకరంద్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్యాట్కో పేరు చెప్పి డబ్బులు డిమాండ్ చేసే వ్యక్తులతో మాకు ఎలాంటి సంబంధం లేదు



(ఉట్నూర్, సాక్షర): క్యాట్కో తరపున ఉట్నూర్ మండల్ వ్యాపారస్తులకు, వివిధ సంస్థలకు, పారిశ్రామికవేత్తలకు, విద్యా సంస్థలకు, వినియోగదారులకు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ తెలంగాణ కన్జ్యూమర్ ఆర్గనైజేషన్ (క్యాట్కో) పత్రిక ప్రకటన విడుదల చేసింది.ఉట్నూర్ మండలంలో కొందరు వ్యక్తులు క్యాట్కో పేరు చెప్పుకొని, తప్పుడు ఐడీ కార్డులు సృష్టించుకుని, వినియోగదారులకు, కొనుగోలుదారులకు అండగా నిలబడి వారి తరపున సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి వినియోగదారులకు న్యాయం చేయించేది పోయి, తాము కన్జ్యూమర్ రైట్స్ (క్యాట్కో) జిల్లా మెంబర్లమని వ్యాపారస్తులను బెదిరిస్తున్నారని, డబ్బులు డిమాండ్ చేసి వసూలు చేస్తున్నారని విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం వచ్చిందని పేర్కొంది.కావున అలాంటి వ్యక్తులతో తమ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని తెలియజేసింది. అలాంటి వ్యక్తులు ఎవరైనా, ఎంతటి వారైనా మీ దగ్గరకు వచ్చి డబ్బులు అడిగి బ్లాక్‌మెయిల్ చేసినచో వెంటనే పోలీసులకు పట్టించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది.అలాంటి వ్యక్తుల ఆచూకీ తమ క్యాట్కో సంస్థ ద్వారా కనుక్కొని అట్టి వారిపై జిల్లా స్థాయి ఉన్నత అధికారులకు త్వరలో ఫిర్యాదు చేయడం జరుగుతుందని తెలియజేసింది.

చిన్నారుల హక్కులు, భద్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత

- పిల్లలకు సురక్షితమైన భవిష్యత్తును అందించాలి : రాజలింగు మోతె



(మంచిర్యాల, సాక్షర) సమాజంలో చిన్నారుల హక్కులను పరిరక్షించడం, వారి భద్రతకు భరోసా కల్పించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని ప్రజా జాగృతి సమితి రాష్ట్ర అధ్యక్షులు, అడ్వకేట్ రాజలింగు మోతె పేర్కొన్నారు.ప్రపంచ పిల్లల లైంగిక దోపిడీ, వేధింపులు, హింస నివారణ మరియు బాధితుల పునరుద్ధరణ దినోత్సవం సందర్భంగాబుధవారం ఆయన మాట్లాడుతూ.. చిన్నారులపై జరుగుతున్న లైంగిక వేధింపులు, హింస, దోపిడీ వంటి ఘటనలు సమాజానికి సిగ్గుచేటని అన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారి ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనిస్తూ వారితో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు.చిన్నారులకు మంచి విద్యతో పాటు తమ హక్కులపై అవగాహన కల్పించాలి. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి చిన్న వయస్సు నుంచే తెలియజేయాలి. బాలలపై లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై పోక్సో చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులు స్పందించాలి. బాధిత చిన్నారులకు న్యాయ సహాయం, మానసిక ధైర్యం, పునరావాసం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.బాలల రక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సమితి నాయకులు నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట మోడల్ స్కూల్ కు ప్రత్యేక ఆర్టీసీ బస్సు ఏర్పాటు



(కాసిపేట, సాక్షర): మండలం లోని తెలంగాణ మోడల్ స్కూల్ కి విద్యార్థులు, సిబ్బంది విజ్ఞప్తి మేరకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, మంచిర్యాల డిపో మేనేజర్ నరేష్ కుమార్ ప్రత్యేక ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. నిత్యం మంచిర్యాల, క్యాతన్ పల్లి, మందమర్రి, సోమగూడెం పరిసర ప్రాంతాల నుండి సుమారు 200 మందికి పైగా విద్యార్థులు పాఠశాలకు రాకపోకలు సాగిస్తున్నారు. సరైన రవాణా సౌకర్యం లేక విద్యార్థులు చాలా నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటు, ప్రైవేటు వాహనాలపై ఆధారపడాల్సి రావడంతో ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థుల విజ్ఞప్తి మేరకు మంచిర్యాల డిపో మేనేజర్ మంచిర్యాల నుండి మోడల్ స్కూల్ వరకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశారు. ఈ బస్సు ఉదయం 8 గంటలకు మంచిర్యాల నుండి బయలుదేరి 9:00గం. లోపు పాఠశాలకు చేరుతుంది. బుధవారం బస్సు ప్రారంభం సందర్భంగా డ్రైవర్ మరియు కండక్టర్ లను పాఠశాల ఉపాధ్యాయులు గణేష్ , చైతన్య స్రవంతి, స్వప్న రాణి, మోహన్, రాకేష్, సంయుక్త , అనిత , భాగ్యశ్రీ సత్కరించారు. ఈ సందర్భంగా బస్సు ఏర్పాటు చేసినందుకు ఆర్టీసీ మంచిర్యాల డిపో మేనేజర్ నరేష్ కుమార్ పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకులుగా తిరుపతి రావు బాధ్యతల స్వీకరణ

- గనులు, భూగర్భ శాఖ కార్యకలాపాలను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలి



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) గనులు, భూగర్భ శాఖ కార్యకలాపాలను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహిస్తూ ప్రభుత్వ నిబంధనలను పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు.జిల్లా గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకులుగా ఎం. తిరుపతి రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నూతన సహాయ సంచాలకులకు శుభాకాంక్షలు తెలిపారు. గనులు, భూగర్భ శాఖ కార్యకలాపాలను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహిస్తూ ప్రభుత్వ నిబంధనలను పక్కాగా అమలు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ రమేష్ పవార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన రియల్ ఎస్టేట్ సంస్థలపై టీజీ రెరా కొరడా

- అనుమతులు లేకుండా ప్రాజెక్ట్ ప్రచారం చేసిన సనాలి ఐటీ పార్క్స్‌కు రూ. 25 లక్షల జరిమానా
- కొనుగోలుదారులకు 10.85 శాతం వార్షిక వడ్డీతో సొమ్ము తిరిగి చెల్లించాలని డెవలపర్లకు ఆదేశాలు
- నిర్మాణాల్లో తీవ్ర జాప్యం చేసిన భువన్‌తేజా ఇన్‌ఫ్రాను డిఫాల్టర్‌గా ప్రకటిస్తూ పనుల రద్దు
- ఆదేశాలు అమలు చేయకపోతే రెరా చట్టం సెక్షన్ 63 కింద మరిన్ని చర్యలు తప్పవని హెచ్చరిక

(హైదరాబాద్, సాక్షర): నిబంధనలను ఉల్లంఘిస్తూ కొనుగోలుదారులను మోసగిస్తున్న పలు రియల్ ఎస్టేట్ కంపెనీలపై తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ రెరా) కఠిన చర్యలు చేపట్టింది. ముందస్తు రిజిస్ట్రేషన్ లేకుండా ప్రాజెక్టులను మార్కెటింగ్ చేయడం, ఇళ్ల నిర్మాణంలో తీవ్ర జాప్యం, చట్టబద్ధమైన అనుమతులు పొందకపోవడం, కొనుగోలుదారుల నుంచి వసూలు చేసిన మొత్తాలను తిరిగి చెల్లించకపోవడం వంటి ఉల్లంఘనలపై అథారిటీ కొరడా ఝళిపించింది. ఈ మేరకు నవంబర్ 17న వెలువరించిన ఉత్తర్వుల ద్వారా పలు సంస్థలపై భారీ జరిమానాలు విధించడంతో పాటు, బాధితులకు వడ్డీతో సహా నగదు తిరిగి చెల్లించాలని ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవులలో చేపట్టిన 'సనాలి ది ఎడ్జ్' ప్రాజెక్టుకు రెరా రిజిస్ట్రేషన్ లేకుండానే ప్రచారం, విక్రయాలు చేపట్టినందుకు గాను సనాలి ఐటీ పార్క్స్ సంస్థకు అథారిటీ రూ. 25 లక్షల భారీ జరిమానా విధించింది. మేనేజింగ్ పార్టనర్ నూర్ హక్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ సంస్థ రెరా చట్టం సెక్షన్ 3(1)ని ఉల్లంఘించినట్లు తేల్చింది. జరిమానా మొత్తాన్ని 30 రోజుల్లోగా చెల్లించాలని, ప్రాజెక్టుకు రిజిస్ట్రేషన్ వచ్చేంతవరకు ప్రకటనలు, బుకింగ్‌లు, విక్రయాలు తక్షణమే నిలిపివేయాలని స్పష్టం చేసింది. అయితే, భూముల రిజిస్ట్రేషన్ రద్దు తమ పరిధిలోకి రాదని స్పష్టం చేస్తూ, పరిహారం కోసం బాధితులు సంబంధిత న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని తెలిపింది. సంగారెడ్డి జిల్లా వెలిమలలోని 'ఆరా' ప్రాజెక్టులో ఇద్దరు కొనుగోలుదారుల నుంచి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేసి, నిర్మాణాన్ని గడువులోగా పూర్తి చేయని భువన్‌తేజ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు టీజీ రెరా కీలక ఆదేశాలు జారీ చేసింది. 1,700 చదరపు అడుగుల ఫ్లాట్ కోసం చెల్లించిన రూ. 26 లక్షలను 10.85 శాతం వార్షిక వడ్డీతో కలిపి 45 రోజుల్లోగా తిరిగి చెల్లించాలని ఆదేశించింది. అలాగే సదరు డెవలపర్‌ను డిఫాల్టర్‌గా ప్రకటిస్తూ ప్రాజెక్ట్ కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలని, భవిష్యత్ ప్రాజెక్టులలోనూ బుకింగ్‌లు చేపట్టరాదని స్పష్టం చేసింది. తెల్లాపూర్‌లోని 'త్రిపుర నిర్వాణ' ప్రాజెక్టులో అనుమతులు లేకుండానే రూ. 41.85 లక్షలు వసూలు చేసిన త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు కూడా రెరా షాక్ ఇచ్చింది. ఆ మొత్తాన్ని 10.85 శాతం వడ్డీతో వాపస్ ఇవ్వాలని నిర్దేశించింది. నవంబర్ 20, 2026 నాటికి రూ. 10 లక్షలు, మిగిలిన మొత్తాన్ని ఫిబ్రవరి 2027 నాటికి నాలుగు సమాన వాయిదాల్లో చెల్లించాలని, వడ్డీ బకాయిలను 60 రోజుల్లో తీర్చాలని ఆదేశించింది. శంకర్‌పల్లిలోని 'జాస్విత ఎస్టేట్స్'లో ప్లాట్ కోసం రూ. 47 లక్షలు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా, ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయిన కేసులో శాండ్‌స్టోన్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ 10.85 శాతం వడ్డీతో పూర్తి నగదును 60 రోజుల్లో తిరిగి ఇవ్వాలని పేర్కొంది. హెచ్‌ఎండీఏ, రెరా అనుమతులు తీసుకోకుండా 'టెక్ హోమ్స్' పేరిట విల్లా కోసం అడ్వాన్స్ తీసుకున్న ఎస్‌వీఎం ఆదిత్య హోమ్స్ సంస్థ రూ. 27,16,430 మొత్తాన్ని 10.85 శాతం వడ్డీతో 60 రోజుల్లోగా తిరిగి ఇవ్వాలని అథారిటీ ఆదేశించింది. పటాన్‌చెరు పరిధిలోని ఘన్‌పూర్‌లో 'ఆర్నేట్-1' ప్రాజెక్టులో జాప్యం కారణంగా బుకింగ్ రద్దు చేసుకున్న కొనుగోలుదారుడికి రూ. 17 లక్షలను శ్రీ ఆదిత్య స్క్వేర్స్ సంస్థ పూర్తి వడ్డీతో తిరిగి చెల్లించాలని ఆదేశిస్తూ, సంస్థ ప్రతిపాదించిన 15 శాతం తగ్గింపు వాదనను తిరస్కరించింది. మహేశ్వరం మండలం సిరిగిరిపురంలోని 'ఎస్‌వీ ఎలక్ట్రానిక్ సిటీ-3' ప్రాజెక్టులో ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయని బీవీఆర్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 7 లక్షలను 10.85 శాతం వడ్డీతో మహిళా బాధితురాలికి చెల్లించాలని ఆదేశించింది. అలాగే హఫీజ్‌పేటలోని 'వాసవి లేక్ సిటీ ఈస్ట్' ప్రాజెక్టులో ఫ్లాట్ అప్పగింత ఆలస్యమైనందుకు గాను వాసవి రియల్టర్స్ ఎల్ఎల్పీ సంస్థ కొనుగోలుదారుడికి రూ. 49.50 లక్షలపై 10.85 శాతం వార్షిక వడ్డీని చెల్లించాలని పేర్కొంది. మియాపూర్‌లోని 'అరినే ఎమరాల్డ్' ప్రాజెక్టులో సేల్ డీడ్ పూర్తయినా ఫ్లాట్ అప్పగించని అరినే ఇన్‌ఫ్రా సంస్థ తక్షణమే ఫ్లాట్ నం. 502ను స్వాధీనం చేయాలని, జాప్యానికి గాను వడ్డీ చెల్లించాలని ఆదేశించింది. రియల్ ఎస్టేట్ చట్టం 2016, నిబంధనలు 2017 ప్రకారం జారీ చేసిన ఈ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైతే, డెవలపర్లపై సెక్షన్ 63 ప్రకారం మరింత కఠిన చర్యలు తీసుకుంటామని టీజీ రెరా తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది.

పౌర రక్షణ శాఖ డైరెక్టర్ జనరల్ వీ.సి. సజ్జనార్‌ను కలిసిన ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ దుర్గం శేఖర్



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): హైదరాబాద్‌లో జరిగిన ఓ శుభకార్య విందు కార్యక్రమంలో తెలంగాణ ఫైర్ సర్వీసెస్, విపత్తు స్పందన, అత్యవసర మరియు పౌర రక్షణ శాఖ డైరెక్టర్ జనరల్ వీ.సి. సజ్జనార్ ఐపీఎస్‌ను ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ దుర్గం శేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ నగర మాజీ పోలీస్ కమిషనర్‌గా ఉన్నప్పటి నుంచే పరిచయం ఉండటంతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.ఈ సందర్భంగా ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన దుర్గం శేఖర్‌ను సజ్జనార్ అభినందించారు. అనంతరం పదోన్నతితో నూతన బాధ్యతలు స్వీకరించిన వీ.సి. సజ్జనార్‌కు దుర్గం శేఖర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ అందిస్తున్న సమర్థవంతమైన పోలీస్ సేవలను దుర్గం శేఖర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. జిల్లాలో భూ మాఫియా కార్యకలాపాలను అరికట్టడంతో పాటు, సామాన్య బాధితులకు న్యాయం జరిగేలా ఎస్పీ అఖిల్ మహాజన్ అందుబాటులో ఉంటూ బాధితులకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు.ముఖ్యంగా ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డే (ప్రజా ఫిర్యాదుల స్వీకరణ) కార్యక్రమంలో బాధితులు నేరుగా ఎస్పీని కలిసి తమ సమస్యలను వివరించే అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. పోలీస్ వ్యవస్థపై నమ్మకంతో పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారని, వారి సమస్యలను సమర్థవంతంగా పరిష్కరిస్తూ బాధితులకు భరోసా కల్పిస్తున్నారని పేర్కొన్నారు.ఆదిలాబాద్ జిల్లాలో దశాబ్ది వ్యవస్థకు తావులేకుండా, బాధితులకు నేరుగా న్యాయం అందేలా కృషి చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్ సేవలు ప్రశంసనీయమని దుర్గం శేఖర్ అన్నారు.

కాంగ్రెస్ పార్టీ కండువా కేవలం ఒక వస్త్రం మాత్రమే కాదు.. మన బాధ్యతకు ప్రతీక



• ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్

(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర) "కాంగ్రెస్ పార్టీ కండువా కేవలం ఒక వస్త్రం మాత్రమే కాదని, అది మన పార్టీ గుర్తింపుకు, సిద్ధాంతాలకు, విలువలకు, మన బాధ్యతకు ప్రతీక అని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులకు, వివిధ నామినేటెడ్ పదవుల్లో కొనసాగుతున్న నాయకులకు, ప్రజాప్రతినిధులకు, పార్టీ ముఖ్య బాధ్యులకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ విజ్ఞప్తి చేశారు.మనమందరం కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకులుగా, మన భుజంపై కాంగ్రెస్ పార్టీ కండువాను తప్పనిసరిగా ధరించాలని కోరుతున్నానని తెలిపారు.ముఖ్యంగా ప్రతి కాంగ్రెస్ పార్టీ సమావేశంలో, పార్టీ కార్యక్రమంలోనే కాకుండా, ప్రభుత్వ పరంగా నిర్వహించే అధికారిక సమావేశాలు, సమీక్షా సమావేశాలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరయ్యే సందర్భాల్లో కూడా వివిధ నామినేటెడ్ పదవుల్లో కొనసాగుతున్న నాయకులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా తమ భుజంపై కాంగ్రెస్ పార్టీ కండువాను ధరించాలని మనవి చేస్తున్నానని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ కండువా కేవలం ఒక వస్త్రం మాత్రమే కాదని, అది మన పార్టీ గుర్తింపుకు, సిద్ధాంతాలకు, విలువలకు, మన బాధ్యతకు ప్రతీక అని అన్నారు. మనం ప్రతి సందర్భంలోనూ కండువా ధరించడం ద్వారా ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ గుర్తింపు, గౌరవం మరింత స్పష్టంగా కనిపించడంతో పాటు, పార్టీ కార్యకర్తల్లో కూడా నూతన ఉత్సాహం, మనోధైర్యం పెరుగుతాయని తెలిపారు.అందువల్ల పార్టీ గౌరవాన్ని పెంపొందించేందుకు, కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచేందుకు, మనమందరం ప్రతి పార్టీ సమావేశంలో, పార్టీ కార్యక్రమంలో, ప్రభుత్వ పరమైన అధికారిక సమావేశాల్లో సైతం కాంగ్రెస్ పార్టీ కండువాను తప్పనిసరిగా భుజంపై ధరించాలని కోరుతూ విజ్ఞప్తి చేస్తున్నానని పేర్కొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి ఎంపీ గోడం నగేష్

(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర) ఆదిలాబాద్ జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేసి, వాటి ప్రయోజనాలను అర్హులైన ప్రజలకు అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ సూచించారు. అభివృద్ధి పనుల్లో జాప్యానికి తావులేకుండా నిరంతరం పర్యవేక్షించాలని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీ గోడం నగేష్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరు, జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతి, వివిధ శాఖల పనితీరు, పెండింగ్ సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా సమీక్షించారు.ప్రత్యేకంగా రైల్వే శాఖ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు, జాతీయ రహదారుల నిర్మాణం, రహదారుల విస్తరణ, విద్యా శాఖ, సమగ్ర శిక్షా అభియాన్, మహిళా శిశు సంక్షేమం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, ఉపాధి హామీ పథకం, పీఎం జన్‌మన్, జన్‌ధన్ యోజన, గిరిజన సంక్షేమం, పోషకాహార పంపిణీ తదితర అంశాలపై శాఖల వారీగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల అమలు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూరేలా చూడాలన్నారు. ప్రజలకు నేరుగా ఉపయోగపడే మౌలిక సదుపాయాల కల్పన, రహదారులు, విద్య, వైద్యం, తాగునీరు, మహిళా శిశు సంక్షేమం, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విడుదలవుతున్న నిధులను సక్రమంగా వినియోగిస్తూ, చేపట్టిన పనుల పురోగతిపై సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ఒక శాఖకు సంబంధించిన పని మరో శాఖతో ముడిపడి ఉన్నప్పుడు పరస్పర సమన్వయంతో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతి శాఖ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల ప్రారంభం, పురోగతి తదితర వివరాలను తనకు ముందస్తుగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, అధికారిక పర్యటనలు, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల సందర్భంగా ప్రొటోకాల్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రొటోకాల్ ఉల్లంఘనలను ఉపేక్షించేది లేదని, నిబంధనలు పాటించని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.విద్యా శాఖ పరిధిలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ) నిర్వహణపై ఎంపీ సమీక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతోపాటు నిధుల వినియోగం, కార్యక్రమాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ విద్యార్థుల కోసం మండల స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించాలని, భవిత కేంద్రాల ద్వారా డిసెంబర్ 3న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు, ఇతర రంగాల్లోనూ సమాన అవకాశాలు కల్పించాలన్నారు.గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పురోగతిని సమీక్షించారు. గ్రామీణ కూలీలకు నిరంతరం ఉపాధి కల్పిస్తూ, చేసిన పనులకు సంబంధించిన వేతనాలను ఎలక్ట్రానిక్ ఫండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎఫ్ఎంఎస్) ద్వారా నెరుగా వారి ఖాతాల్లో జమ చెస్తున్నట్లు అధికారులు వివరించారు. ఉపాధి హామీ నిధులతో గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సీసీ రహదారులు తదితర మౌలిక సదుపాయాల పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈజీఎస్, పీఎంకేవైసీ, ఐడబ్ల్యూఎంపీ, ఏబీఎం-జీఎన్ఆర్ఎల్ఎం, ఎన్ఆర్ఎల్ఎం, ఎన్ఎస్ఎల్ఎం తదితర కార్యక్రమాల అమలుపై ఎంపీ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచడంతోపాటు అభివృద్ధి పనులు ప్రజలకు ఉపయోగపడేలా చేపట్టాలన్నారు.రవాణా, రహదారులు, భవనాల శాఖతోపాటు జాతీయ రహదారుల పనులపై సమీక్ష సందర్భంగా సెంట్రల్ రోడ్ ఫండ్ (సీఆర్ఎఫ్) నిధులతో కాప్రి నుంచి బేలా వరకు, ఇచ్చోడ నుంచి డేడ్ర వరకు చేపడుతున్న రహదారుల విస్తరణ పనుల పురోగతిని అధికారులు వివరించారు.పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీ సూచించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని, నిర్మాణ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.మహిళా, శిశు సంక్షేమ శాఖ పరిధిలో అమలవుతున్న పథకాలు, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పోషకాహారం, ఇతర సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పోస్టుల భర్తీలో రోస్టర్ విధానాన్ని, ప్రభుత్వ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎంపీ సూచించారు. నియామక ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అర్హులైన గిరిజన కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించే అంశాలపై సమీక్షించారు. పీఎం జన్‌మన్ పథకం అమలులో భాగంగా అర్హులైన కుటుంబాలను గుర్తించి, వారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జన్‌ధన్ యోజనతోపాటు ఇతర కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు, ప్రయోజనాల పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. దిశ సమావేశంలో ఎంపీ సూచించిన ప్రతి అంశంపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల అమలులో శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని, పరస్పర సహకారంతో పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలన్నారు. ప్రతి శాఖ ప్రొటోకాల్‌కు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.అనంతరం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, ఖేలో ఇండియా పోస్టర్లను ఎంపీ గోడం నగేష్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన వారందరూ వాటిని సద్వినియోగం చేసుకునేలా ప్రచారం నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, ఉట్నూర్ ఐటీడీఏ పీఓ మంద మకరంద్, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్‌డీఏ పీడీ రాథోడ్ రవీందర్, ట్రాన్స్‌కో ఎస్ఈ సుభాష్, డీఈఓ మాధవి, డీపీఓ రమేష్, ఐసీడీఎస్ పీడీ మిల్కా, దిశ కమిటీ నామినేటెడ్ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

• నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) ప్రతి ఫిర్యాదుపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, చట్టప్రకారం చర్యలు తీసుకొని సమస్యలను త్వరగా పరిష్కరించాలని నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ ఆదేశించారు.నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, చట్టప్రకారం చర్యలు తీసుకొని సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.కుటుంబ సమస్యలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలతో మాట్లాడి కౌన్సిలింగ్ నిర్వహించారు. సమస్యలను పరస్పర అవగాహనతో పరిష్కరించుకునేలా సూచనలు చేశారు.పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు గ్రీవెన్స్ డే మంచి అవకాశమని, ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు.

బొగ్గు నాణ్యతలో బెల్లంపల్లి ఏరియా మూడో స్థానం..

• ఏరియా జిఎం ఎం.శ్రీరమేష్



(రెబ్బెన,సాక్షర) సింగరేణి ఆధికారులు,ఉద్యోగుల కృషి కారణంగా బెల్లంపల్లి ఏరియా మరో మైలురాయిని అధిగమించిందని ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీరమేష్ అన్నారు.సింగరేణి సంస్థ 2025–26సంవత్సరానికి సంబంధించి ఓవరాల్ గ్రేడ్ సంతృప్తి విభాగంలో బెల్లంపల్లి ఏరియా మూడో స్థానాన్ని సాధించడం పట్ల ఉద్యోగులను జిఎం అభినందించారు.బుధవారం ఆర్జి1ఏరియాలో జరిగిన 2026క్వాలిటీ అస్యూరెన్స్(నాణ్యత భరోసా)వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో డైరెక్టర్(పి అండ్ పి)కే. వెంకటేశ్వర్లు,కార్పొరేట్ జీఎం(క్వాలిటీ)ఎ.రవికుమార్‌లు ఏరియా అధికారులకు జ్ఞాపికను అందజేశారు. ఏరియా అధికారులు,ఉద్యోగులను వారు ప్రత్యేకంగా ప్రశంసించారు.బొగ్గు నాణ్యత ప్రమాణాలను నిరంతరం కొనసాగించడంలో ఏరియా ఉద్యోగులు చూపిన నిబద్ధత,అంకితభావం, సమిష్టి కృషిని కొనియాడారు.ఈ ఘనత సాధించిన బెల్లంపల్లి ఏరియా అధికారులకు, ఉద్యోగులందరికీ అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఖైరిగుర ఓసీ పీవో మచ్చగిరి నరేందర్,సిహెచ్పి హెచ్ఓడి కోటయ్య,ఏరియా క్వాలిటీ అధికారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి మనుగడను కాపాడాలి..



• ఏఐటీయూసీ నాయకులు

(రెబ్బెన,సాక్షర) సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటియుసీ)సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు గోలేటి బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం గోలేటిలోని బెల్లంపల్లి ఏరియా జిఎం కార్యాలయం ముందు రెండు రోజుల(18,19)రిలే నిరాహార దీక్షలను ఏఐటియూసి నాయకులు ప్రారంభించారు.కార్యక్రమానికి గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి తో పాటు ఉపాధ్యక్షులు బయ్య మొగిలి ముఖ్య అతిథులుగా హాజరై దీక్షా శిబిరంలో కూర్చున్న కార్మిక నాయకులకు పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన 60వేల కోట్ల రూపాయల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండి బకాయిలు చెల్లించకపోవడం వల్ల సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయి సింగరేణి మనుగడకే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.బొగ్గు ఉత్పత్తిలో కీలకమైన ఓపెన్ కాస్ట్,అండర్ గ్రౌండ్ గనులకు అవసరమైన సేఫ్టీ మెటీరియల్,షావల్స్,డంపర్లు,డోజర్లు ఇతర యంత్ర పరికరాలను నిధుల లేమి కారణంగా కొనుగోలు చేయలేకపోతున్నారని అన్నారు.ప్రస్తుతం ఉన్న యంత్రాలు తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడం కష్టతరంగా మారిందని,ఇది సంస్థ భవిష్యత్తుకు గొడ్డలిపెట్టు అని పేర్కొన్నారు. యూనియన్ ప్రధాన డిమాండ్లలో భాగంగా అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు నిర్వహించే మెడికల్ బోర్డును 100శాతం నిర్వహించాలని,వివిధ కారణాలతో డిస్మిస్ అయిన కార్మికులందరినీ తిరిగి విధుల్లోకి తీసుకొని ఉపాధి కల్పించాలని,ఆర్ఎల్సి సమక్షంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ చేసుకున్న 24అగ్రిమెంట్లను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.మొదటి రోజు ఖైరిగుర ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది కార్మికులు రిలే నిరాహారదీక్షలో కూర్చున్నారు.ఈ కార్యక్రమంలో గోలేటి బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు జూపాక రాజేష్,కె.కిరణ్ బాబు,మీస చంద్రశేఖర్,ఖైరగుర సహాయ కార్యదర్శి మాల ఓదెలు,షిఫ్ట్ ఇంచార్జీలు రాయిని రాజయ్య,తొంగల వెంకటేష్, పుట్ట అంజయ్య,ఆర్గనైజింగ్ కార్యదర్శులు బి.జగ్గయ్య, సురేష్ కోరి,అదాని ఆఫ్రికా, వడ్డేపల్లి దిలీప్,గడ్డం రమేష్,కమిటీ సభ్యులు ఖైరగుర మైనింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్,ఎలక్ట్రికల్ వర్క్ ఇన్స్పెక్టర్ నరేష్ బాబు,కార్మికనాయకులు అన్నం రాజ్ కుమార్,రవి,మధుబాబు,తిరుపతి,గున్నాల రాజేలు,కే.శ్రీనివాస్,తుమ్మల సంపత్,వెంకటస్వామి, ధర్మయ్య, కోడూరు రమేష్,అల్లాడి కోటి,తిరుమల్, సదయ్య,సంపత్,ఆరెల్లి పోశం,పి.వెంకటేష్,పి.తిరుపతి తదితరులు పాల్గొని దీక్షకు సంఘీభావం తెలిపారు.

గంజాయి రహిత జిల్లా నిర్మాణానికి ప్రజలు సహకరించాలి

• జైనథ్ సీఐ జి. శ్రావణ్

(బేల, సాక్షర) గంజాయి రహిత జిల్లా నిర్మాణానికి ప్రజలు ప్రతి ఒక్కరు, యువత ముందుండి కృషి చేయాలని జైనథ్ సీఐ జి. శ్రావణ్ తెలిపారు.గంజాయి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బేల బస్టాండ్ సమీపంలో తనిఖీలలో 22 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.గతంలో బేల మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గంజాయి తరలిస్తుండగా అనుమానస్పదంతో తనిఖీలు నిర్వహించగా నిందితుడు బాది గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ వద్ద 22 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు, ఇతనిపై బేల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి న్యాయస్థానం అనుమతితో ఈరోజు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు జైనథ్ సీఐ జి. శ్రావణ్ తెలిపారు.గంజాయి తాగిన, సేవించిన, వ్యాపారం చేసిన, పండించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి పండించిన వారికి ప్రభుత్వ పథకాలు రాకుండా సిఫార్సు చేయడం జరుగుతుందని, గంజాయి రహిత జిల్లా నిర్మాణానికి ప్రజలు ప్రతి ఒక్కరు, యువత ముందుండి కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ మధు కృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వామి జగద్గురు శ్రీ శ్రీ నరేంద్ర మహారాజ్ పొడు క దర్శనం



(తానూర్, సాక్షర): తానూర్ మండల్ కేంద్రంలోని శ్రీ శ్రీ నరేంద్ర మహారాజ్ పొడుక దర్శనం లో ప్రజా ట్రస్ట్ చైర్మన్ బోస్లే మోహన్ రావు పాటిల్ పాల్గొన్నారు. స్వామి వారి పాదుకలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. భక్తి ఆధ్యాత్మిక త సంప్రదాయాల కు ప్రధాన్యాతనిస్తూ ఇలాంటి పవిత్ర కార్యక్రమలో పాల్గొనటం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు ఆయనతోపాటు జ్ఞానేశ్వర్ సక్రు పటేల్ నాను అభిమానులు తదితరులు ఉన్నారు.

యువతలోని ప్రతిభను వెలికితీసేందుకు యువజనోత్సవాలు చక్కటి వేదిక

• మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్



(ఆదిలాబాద్, సాక్షర) యువతలో దాగి ఉన్న సృజనాత్మకత, కళా నైపుణ్యాలు, సాంస్కృతిక ప్రతిభను వెలికితీసేందుకు యువజనోత్సవాలు ఎంతగానో ఉపయోగపడతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు.జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న సృజనాత్మకత, కళా నైపుణ్యాలు, సాంస్కృతిక ప్రతిభను వెలికితీసేందుకు యువజనోత్సవాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. చదువుతో పాటు కళలు, సాహిత్యం, సంగీతం, నృత్యం వంటి వివిధ రంగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు.యువత దేశ భవిష్యత్తుకు పునాదులని, వారిలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి, దానికి తగిన కృషి చేస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ యువజనోత్సవంలో విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించడం అభినందనీయమని, విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా రాణించి అదిలాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎంపీ గోడం నాగేశ్, కార్యనిర్వాహక సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.

భారత్‌లో 'అవెంజర్స్: డూమ్స్‌డే' జోరు - అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం



మార్వెల్ స్టూడియోస్ ప్రతిష్టాత్మక చిత్రం 'అవెంజర్స్: డూమ్స్‌డే' కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు శుభవార్త. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో, భారత్‌లో కూడా అడ్వాన్స్ బుకింగ్స్ అధికారికంగా ప్రారంభమయ్యాయి. సోషల్ మీడియాలో అభిమానులు చేపట్టిన #OpenDoomsdayBookings ప్రచారానికి స్పందించిన మార్వెల్ సంస్థ టికెట్ బుకింగ్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. బుకింగ్స్ ప్రారంభమైన కొద్ది సమయంలోనే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. ముంబై, బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్, కొచ్చి వంటి ప్రధాన నగరాల్లో టికెట్లు వేగంగా అమ్ముడవుతున్నాయి. రోజంతా వివిధ సమయాల్లో షోలు అందుబాటులో ఉండటంతో అభిమానులు మొదటి రోజు మొదటి షో టికెట్ల కోసం పోటీపడుతున్నారు. ఈ సినిమాపై ప్రపంచవ్యాప్తంగా భారీ క్రేజ్ నెలకొంది. అడ్వాన్స్ టికెట్ అమ్మకాలు ప్రపంచవ్యాప్తంగా 150 మిలియన్ డాలర్లను దాటినట్లు సమాచారం. ఇక ఈ సినిమా విడుదలైన తొలి ట్రైలర్ కేవలం 24 గంటల్లోనే 503 మిలియన్ల వ్యూస్ సాధించి, ప్రపంచ సినిమా చరిత్రలో అత్యధిక వ్యూస్ సాధించిన ట్రైలర్లలో రెండో స్థానంలో నిలిచింది. భారతీయ ప్రేక్షకులకు మరో ప్రత్యేకమైన కానుకగా, అమెరికా విడుదల కంటే ఒక రోజు ముందుగానే ఈ సినిమా మన దేశంలో ప్రేక్షకుల ముందుకు రానుంది. డిసెంబర్ 17న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ చిత్రం విడుదల కానుంది. ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషల్లో మార్వెల్ స్టూడియోస్ ప్రెజెంట్స్ ఇన్ఫినిటీ విజన్‌తో పాటు ఇతర ప్రీమియం ఫార్మాట్లలో ఈ చిత్రం ప్రేక్షకులను అలరించనుంది. సూపర్ హీరోల మధ్య జరగబోయే భారీ పోరాటాన్ని వెండితెరపై చూసేందుకు సిద్ధమవ్వండి. అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభమైన నేపథ్యంలో వెంటనే మీ టికెట్లను బుక్ చేసుకుని, ఈ అద్భుతమైన సినిమాను తొలిరోజే వీక్షించండి.

రెండు లక్షల మందితో పాట్నాలో అత్యంత భారీ ఎత్తున నిర్మించిన 'పుష్ప 2' పాట్నా కార్యక్రమానికి రెండేళ్లు..



- 2.6 లక్షల మంది ఆన్‌లైన్ వీక్షకులతో సరికొత్త మైలురాయి

2 లక్షలకు పైగా ప్రజలు హాజరవడం, 2.6 లక్షల మంది యూట్యూబ్ వీక్షకులు ఏకకాలంలో వీక్షించడంతో, భారతీయ సినిమా చరిత్రలో అపూర్వమైన దృశ్యంగా నిలిచిన 'పుష్ప 2' ట్రైలర్ విడుదల కార్యక్రమం రెండు సంవత్సరాల క్రితం 2024 నవంబర్ 17న, భారతదేశంలో సినిమా ప్రచార కార్యక్రమాల స్థాయిని పునర్నిర్వచించిన ఒక అద్భుతమైన సినిమా దృశ్యానికి పాట్నా సాక్ష్యంగా నిలిచింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2: ది రూల్' ట్రైలర్ విడుదల కార్యక్రమం 2 లక్షలకు పైగా ప్రజలు అపూర్వంగా హాజరై ఒక చారిత్రాత్మక వేడుకగా మారింది. ఈ కార్యక్రమానికి మరో విశేషమైన మైలురాయిగా ట్రైలర్ విడుదల కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం యూట్యూబ్‌లో అసాధారణంగా 2.6 లక్షల మంది ఏకకాల వీక్షకులను నమోదు చేసింది. ఇది ఒక భారతీయ సినిమా కార్యక్రమానికి నమోదైన అత్యధిక ప్రత్యక్ష వీక్షకుల సంఖ్యగా నిలిచింది. ప్రత్యక్షంగానూ, డిజిటల్‌గానూ ఈ కార్యక్రమం అసాధారణ స్థాయిలో జరిగింది. తమ అభిమాన హీరోని ఒక్కసారి చూడటానికి వేలాది మంది అభిమానులు వేదిక వద్దకు, చుట్టుపక్కల ప్రాంతాలకు పోటెత్తగా, లక్షలాది మంది ఆన్‌లైన్‌లో ఈ వేడుకలను వీక్షించారు. ఈ అద్భుతమైన స్పందనకు సెంటరాఫ్ అట్రాక్షన్ అల్లు అర్జున్. ఆయనకి గ్లోబల్ ఇమేజ్, హద్దుల్లేని అభిమానం వల్లే ఇదంతా సాధ్యమైంది. పాట్నాలో లభించిన ఈ అఖండ స్పందన, ఆయనకున్న అపారమైన పాన్-ఇండియా స్టార్‌డమ్‌ను, పుష్ప ఫ్రాంచైజీకి లభించిన అపూర్వమైన ఆదరణను ప్రతిబింబించింది. ఒక సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమంగా ప్రారంభమైనది కాస్తా.. ఒక భారీ బహిరంగ వేడుకగా రూపుదిద్దుకుంది. జనసమూహాన్ని సమీకరించడం, డిజిటల్ వీక్షణలు, ప్రేక్షకుల భాగస్వామ్యం వంటి విషయాలలో భారతీయ సినిమా కార్యక్రమాలకు ఇది ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పింది. రెండు సంవత్సరాల తర్వాత కూడా పాట్నాలో జరిగిన ఈ కార్యక్రమం 'పుష్ప 2: ది రూల్' ప్రయాణంలో ఒక కీలకమైన ఘట్టంగా, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ క్రేజ్‌కి నిదర్శనంగా నిలిచింది.

ఇట్లు అర్జున' తొలి సినిమాతోనే విజయాన్ని అందుకున్న అనీష్‌కు అభినందనలు :మెగాస్టార్ చిరంజీవి



కింగ్ నాగార్జున సమర్పణలో వచ్చిన లేటెస్ట్ హార్ట్‌బస్టర్ 'ఇట్లు అర్జున'. అనీష్ హీరోగా పరిచయమైన ఈ చిత్రంలో అనస్వర రాజన్ కథానాయికగా నటించింది. మహేష్ ఉప్పల ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమయ్యారు. దర్శకుడు వెంకీ కుడుముల వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు. 'ఇట్లు అర్జున' నవంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది. ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకుని సక్సెస్ ఫుల్ గా రన్ అవుతున్న నేపథ్యంలో చిత్ర బృందం థాంక్ యూ మీట్ నిర్వహించింది. మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్ గా జరిగింది. థాంక్ యూ మీట్ లో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఇక్కడి వాతావరణం చూస్తుంటే నిజమైన సక్సెస్ అంటే ఏంటో మీ ఉత్సాహంలోనే తెలుస్తోంది. ఈ ఎనర్జీ చూస్తుంటేనే సినిమా ఎంత పెద్ద విజయం సాధించిందో అర్థమవుతోంది. హీరో అనీష్ చాలా అదృష్టవంతుడు. ఇండస్ట్రీలో ఉన్న ఎంతోమంది హీరోలు ఒక డెబ్యూ హీరోకు ఈ స్థాయిలో సపోర్ట్ చేయడం చాలా అరుదు. అది ఒక్క అనీష్‌కే దక్కింది. ఈ సినిమాలోని ఒక సాంగ్‌ను నాని రిలీజ్ చేశారు. ట్రైలర్‌ను తారక్ రిలీజ్ చేశారు. కింగ్ నాగార్జున గారు ఈ సినిమాకు వెన్నుముకలా నిలిచారు. రామ్ చరణ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు వచ్చారు. ఇప్పుడు నేను ఈ వేడుకకు వచ్చాను. అంతేకాదు, ఈ సినిమా ప్రీమియర్స్‌కు వెంకటేష్ గారితో పాటు ఎంతోమంది వచ్చి అనీష్‌ను అభినందించారు. ఇంతమంది ఈ సినిమాను ఎందుకు ప్రేమిస్తున్నారు? ఇంతగా ఎందుకు సపోర్ట్ చేస్తున్నారు? అనే ఆలోచన మీకు రావచ్చు. దానికి కారణం నా మిత్రుడు మహేష్ రెడ్డి. ఆయన చేసుకున్న పుణ్యం, బాబాపై ఆయనకున్న భక్తి, సినిమా మీద ఆయనకున్న ప్రేమ, అభిమానం ఇవన్నీ ఈ సినిమాకు ఇంతటి సపోర్ట్ రావడానికి కారణమయ్యాయి. వ్యాపారంలో ఎంతో గొప్ప స్థాయిలో ఉన్నప్పటికీ సినిమాపై ఆయనకున్న ప్రేమ, భక్తిభావం ప్రత్యేకమైనవి. నాగార్జున గారితో ఆయనకు ఉన్న అనుబంధం, గతంలో కలిసి చేసిన సినిమాల వల్ల ఈ సినిమా పట్ల కూడా ఆయనకు ప్రత్యేకమైన మక్కువ ఏర్పడింది. వాళ్ల అబ్బాయికి కూడా సినిమాలపై ఆసక్తి కలగడం, నటన వైపు రావడం, తల్లిదండ్రులు అతన్ని ఎంకరేజ్ చేయడం జరిగింది. ఇంత అద్భుతమైన టాలెంట్, ఆసక్తి ఉన్న అనీష్ ను మనం కూడా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి ఒక్కరూ అతని వెనుక నిలబడ్డారు. ప్రేక్షకులు కూడా సినిమా కంటెంట్ నచ్చి విజయాన్ని అందించారు. 'ఇట్లు అర్జున' యూనిట్‌లోని ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు. గతంలో పెద్ద ఈవెంట్ సినిమాలు ఉన్నప్పుడే ప్రేక్షకులు థియేటర్లకు వెళ్లే పరిస్థితి కనిపించేది. కానీ గత రెండేళ్లుగా చిన్న సినిమాలు, మంచి కంటెంట్ ఉన్న సినిమాలను కూడా ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ఇప్పుడు పరిశ్రమ కొత్తవాళ్లతో కళకళలాడుతోందంటే దానికి కారణం యంగ్ టాలెంట్. యంగ్ రైటర్స్, డైరెక్టర్స్ సినిమా పరిశ్రమకు కొత్త ఉత్సాహాన్ని, ఊపును తీసుకొచ్చి ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తున్నారు. అందుకే యంగ్ రైటర్స్, డైరెక్టర్స్‌కు నా అభినందనలు. సీనియర్ డైరెక్టర్లు ఇండస్ట్రీకి గౌరవం తీసుకురావచ్చు. కానీ కొత్త కథలతో, కొత్త ఆలోచనలతో ప్రేక్షకులను థియేటర్లకు రప్పించే బాధ్యతను యంగ్ టాలెంట్ కూడా అద్భుతంగా నిర్వహిస్తోంది. 'ఇట్లు అర్జున' సినిమా వెనుక కూడా మంచి యంగ్ టీమ్ ఉంది. హీరో అనీష్, హీరోయిన్ అనస్వర, ప్రొడ్యూసర్ వెంకీ కుడుముల, డైరెక్టర్ మహేష్.. ఇలా అందరూ మంచి యంగ్ టాలెంట్. ఈ సినిమా ఇంత పెద్ద విజయం సాధించడానికి వీళ్లంతా ఎంతో కష్టపడ్డారు. ఇలాంటి కొత్త టాలెంట్ ఇంకా రావాలి. ఈ పరిశ్రమ ఒక జీవనదిలా నిరంతరం కొనసాగుతుంటే ఎంతోమంది బాగుపడతారు, అభివృద్ధిలోకి వస్తారు. ఈరోజు మధ్యాహ్నమే సినిమా చూశాను. అనీష్ తన హావభావాలతో, బాడీ లాంగ్వేజ్‌తో ఆద్యంతం అందరినీ ఆకట్టుకున్నాడు. మాటలు లేకుండా తనవైపు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడం ఒక కొత్త నటుడికి చాలా కష్టం. 'గీతాంజలి'లో నాగార్జున గారు క్యాన్సర్ పేషెంట్‌గా, 'పున్నమినాగు' నేను చేసిన పాత్ర, వినికిడి లోపం ఉన్న పాత్రలో 'రంగస్థలం'లో చరణ్, లెనిన్ లో అఖిల్, మొన్నటికి మొన్న సూర్య సీన్ లో బ్లైండ్ క్యారెక్టర్‌లో.. ఇలా హీరో పాత్రల్లో ఏదైనా లోపం ఉండేలా చూపించడం ఒక ఛాలెంజ్. వాళ్లంతా తమ అనుభవంతో ఆ ఛాలెంజ్‌ను నిరూపించుకున్నారు. కానీ అలాంటి ఛాలెంజింగ్ రోల్ అనీష్‌కు తొలి సినిమాకే రావడం, దాన్ని అద్భుతంగా నిరూపించుకోవడం, ప్రేక్షకుల ప్రేమ, ఆశీస్సులు పొందడం నిజంగా గొప్ప విషయం. తొలి సినిమాతోనే ఆ అదృష్టాన్ని అనీష్ పొందగలిగాడు. తనకు హ్యాట్సాఫ్. ఇలాంటి మరిన్ని మంచి, అద్భుతమైన పాత్రలతో ముందుకు వెళ్తూ ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకోవాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాలో నటించిన ప్రతి ఒక్కరూ అద్భుతంగా చేశారు. అనస్వర తన పాత్రలోని విభిన్న కోణాలను చాలా బాగా ప్రజెంట్ చేసింది. ఆమె నటన నాకు చాలా నచ్చింది. అలాగే ఈ సినిమాను డైరెక్టర్ మహేష్ చాలా వైవిధ్యంగా తెరకెక్కించి ప్రేక్షకుల మెప్పు పొందాడు. సినిమాలో ప్రేమకథను బ్లెండ్ చేసిన విధానం, స్క్రీన్‌ప్లే చాలా బాగున్నాయి. అందుకే మొదటి సీన్ నుంచి చివరి సీన్ వరకు సినిమా మనల్ని కట్టిపడేస్తుంది. మహేష్‌కు చాలా గొప్ప భవిష్యత్తు ఉంది. తమన్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. తను 'కాకా' సినిమా కూడా చేస్తున్నాడు. కచ్చితంగా ఆ సినిమాతో కూడా కొడతాం. ఇట్లు అర్జున్ థియేటర్లలో చూడండి. రెండున్నర గంటల ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారంటీ. ఈ సినిమా ఎంత బాగుంటే నాగార్జున గారు అంతగా భుజాన వేసుకుంటారు. వెంకీ కుడుముల ఈ సినిమాతో ప్రొడ్యూసర్‌గా మారాడు. నిజానికి తన సినిమాలంటే నాకు చాలా ఇష్టం. నాతో ఒక సినిమా చేయమని కూడా అడిగాను. మంచి కథతో వస్తానని చెప్పాడు (నవ్వుతూ). తను నిర్మాతగా కూడా మంచి విజయం సాధించాడు. మరిన్ని సినిమాలు నిర్మించాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాలో పనిచేసిన ప్రతి ఒక్కరూ అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. అందరికీ హృదయపూర్వక అభినందనలు. జైహింద్! కింగ్ నాగార్జున మాట్లాడుతూ.. "మీ హుషారు, ఎనర్జీ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా గురించి ఇప్పటికే పలుమార్లు మాట్లాడాను. ఈ సినిమాను నేను ప్రజెంట్ చేశాను. చాలా సంతోషంగా ఉంది. అనీష్ విషయంలో చాలా గర్వంగా ఉంది. అలాగే అనస్వర, మహేష్‌తో పాటు ప్రతి ఒక్కరికీ కంగ్రాట్యులేషన్స్. ఈ వేడుకలో అనీష్ అసిస్టెంట్ డైరెక్టర్స్ అందరినీ పిలిచి థాంక్స్ చెప్పడం నాకు చాలా నచ్చింది. తెలుగు సినిమా ప్రేక్షకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. కొత్త టాలెంట్‌ను, కొత్తదనాన్ని వాళ్లు ఎంతో ఎంకరేజ్ చేస్తారు. చిరంజీవి గారి అబ్బాయి రామ్ చరణ్ నన్ను అన్నా అని పిలుస్తాడు. మా అబ్బాయి అఖిల్ ఏమో చిరంజీవి గారిని పెదనాన్న అంటాడు. మరి ఆయన్ని నేను ఏమని పిలవాలో అర్థం కావడం లేదు (నవ్వుతూ). సో.. ఈరోజు బాస్ ఇక్కడికి రావడం చాలా హ్యాపీగా ఉంది. రామ్ చరణ్ నన్ను అన్నా అంటాడు కాబట్టి, నేను కూడా చిరంజీవి గారిని అన్నా అని పిలుస్తాను. చిరంజీవి గారు ఈ వేడుకకు వచ్చి టీంను బ్లెస్ చేయడం చాలా ఆనందంగా ఉంది. హీరో అనీష్ మాట్లాడుతూ.. "అందరికీ నమస్కారం. చిరంజీవి గారి అభిమానులకు, అక్కినేని నాగార్జున గారి అభిమానులకు థాంక్యూ సో మచ్. నాగార్జున గారిది చాలా పెద్ద మనసు. ఆయనను కలిసినప్పటి నుంచి నాకు అందించిన సపోర్ట్, ప్రోత్సాహాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఇది నాకు జీవితాంతం గుర్తుండిపోయే మెమరీ. ప్రతి ఇంట్లో చిరంజీవి గారి పేరు వినిపిస్తుంది. ఎవరైనా సినిమాల్లోకి వెళ్లాలన్నా, యాక్టర్ అవ్వాలన్నా 'నువ్వు ఏమైనా చిరంజీవి అన్నా?' అని అంటుంటారు. ఆయన ఎంతోమందికి ఇన్‌స్పిరేషన్. అలాంటి వారిలో నేను కూడా ఒకడిని. ఆయన సమక్షంలో ఈ వేదికపై నిలబడి మాట్లాడటం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నాను. తన అమూల్యమైన సమయాన్ని కేటాయించి మమ్మల్ని సపోర్ట్ చేయడానికి వచ్చిన చిరంజీవి గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు. ఇట్లు అర్జున' రెండేళ్ల జర్నీ. ఈ ప్రయాణంలో చాలా విషయాలు నేర్చుకున్నాను. మా టీమ్‌లోని ప్రతి ఒక్కరికీ థాంక్యూ. సినిమా చూసిన వాళ్లందరూ చాలా బాగుందని చెప్తున్నారు. ముఖ్యంగా యాక్షన్ బాగుందని, మ్యూజిక్ బాగుందని అభినందిస్తున్నారు. వందమంది సినిమా చూస్తే అందులో 90 మందికి అర్జున్ ప్రేమ వినిపించింది. ఈ క్యారెక్టర్ నేను చేయగలనని నమ్మిన వెంకీ అన్నకు థాంక్యూ. ఇలాంటి మంచి కథ రాసి నన్ను నమ్మిన మా డైరెక్టర్ మహేష్‌కు థాంక్యూ. ఈ జర్నీలో ఆయన నాకు ఎన్నో విషయాలు నేర్పించారు. మా సినిమాకు అద్భుతమైన మ్యూజిక్ అందించిన తమన్ ప్రతి పాట కోసం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కోసం ప్రాణం పెట్టి పనిచేశారు. ఈ సినిమా జర్నీలో నాకు సపోర్ట్ చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు. తారక్ అన్న, చరణ్ అన్న, నాని అన్న.. ఇలా అందరికీ థాంక్యూ. మహేష్ బాబు గారి లాంటి సూపర్‌స్టార్స్‌తో పాటు ఎంతోమంది నటీనటులు మా సినిమా గురించి ట్వీట్ చేశారు. అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. ఒక కొత్త హీరో సినిమాకు ఇంత సపోర్ట్ రావడం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నాను. తెలుగు ప్రేక్షకులకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. సినిమా చూసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఇంకా థియేటర్లలో మా సినిమాను చూస్తారని కోరుకుంటున్నాను. ఇది నా తొలి అడుగు. నన్ను ఇంతగా ప్రోత్సహించిన, నాపై నమ్మకం ఉంచిన నా తల్లిదండ్రులకు కృతజ్ఞతలు. మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మాట్లాడుతూ.. "అందరికీ నమస్కారం. చిరంజీవి గారికి, నాగార్జున గారికి ధన్యవాదాలు. ఈ మధ్యకాలంలో యూనానిమస్‌గా ఇంత మంచి రివ్యూ రావడం 'ఇట్లు అర్జున'కు దక్కింది. అనీష్ ఈ సినిమాతో చాలా మంచి ఆరంభం చేశాడు. తనకు యూనివర్స్ మొత్తం సపోర్ట్ చేసినట్లు అనిపిస్తోంది. ఈ సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు. 'ఇట్లు అర్జున' నా మనసుకు చాలా దగ్గరైన సినిమాల్లో ఒకటి. ఈ సినిమా అద్భుతమైన విజయం సాధించడం చాలా ఆనందంగా ఉంది. అనస్వర రాజన్ అద్భుతంగా నటించింది. ఈ సినిమా ఆడియో ఆల్బమ్ కూడా చాలా పెద్ద హిట్ అయింది. అందరికీ థాంక్యూ. నాగార్జున గారు ఈ సినిమాకు వెన్నుముకలా నిలిచారు. తన సపోర్ట్ మొత్తం అందించారు. ఒక సినిమా సక్సెస్ అయితే ఇండస్ట్రీ మొత్తానికి సక్సెస్ వచ్చినట్టే. అందరికీ మంచి ఎనర్జీ వస్తుంది. నవంబర్‌లో చాలా మంచి విజయాలు రావడం చాలా ఆనందంగా ఉంది. బాస్ చిరంజీవి గారు ఈ వేడుకకు రావడం చాలా సంతోషంగా ఉంది. 'కాకా' కోసం ఇప్పుడే సాంగ్ పూర్తి చేసుకుని ఇక్కడికి వచ్చారు. నేను ఆ సినిమా వీడియో కోసం ఎదురుచూస్తున్నా. చిరంజీవి గారు ఎప్పుడూ కొత్త టాలెంట్‌ను ప్రోత్సహిస్తుంటారు. ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు." హీరోయిన్ అనస్వర రాజన్ మాట్లాడుతూ.. "ఇది చాలా బ్యూటిఫుల్ జర్నీ. గత కొన్ని రోజులుగా మేము థియేటర్లను విజిట్ చేస్తున్నాం. అన్ని చోట్ల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. మా సినిమాకు సపోర్ట్ చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఈ అవకాశం ఇచ్చిన మా డైరెక్టర్‌కు, ప్రొడ్యూసర్‌కు థాంక్యూ. మేము థియేటర్ విజిట్స్‌కు వెళ్లినప్పుడు అనీష్ పర్ఫార్మెన్స్‌ను ఆడియన్స్ అప్రిషియేట్ చేస్తుంటే చాలా హ్యాపీగా అనిపించింది. తను ఎంత కష్టపడ్డాడో నాకు తెలుసు. తను మరిన్ని అద్భుతమైన సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. చిరంజీవి గారు మనందరికీ ఇన్‌స్పిరేషన్. ఆయన ఈ వేడుకకు వచ్చి బ్లెస్ చేయడం మాకు ఎంతో ఆనందాన్నిచ్చింది. నాగార్జున గారు మా సినిమాను ప్రజెంట్ చేయడం మాకు ఎంతో సంతోషంగా ఉంది. ఆయనతో కలిసి వర్క్ చేయడం చాలా హ్యాపీగా ఉంది. ఈ సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు." నిర్మాత వెంకీ కుడుముల మాట్లాడుతూ.. "చిరంజీవి గారికి, నాగార్జున గారికి నా కృతజ్ఞతలు. డైరెక్టర్ మహేష్ చాలా జెన్యూన్ ఫిల్మ్ మేకర్. తనని సపోర్ట్ చేయాలనిపించింది. మాటలు రాని మూగవాడి పాత్రతో ఈ సినిమాను అద్భుతంగా తెరకెక్కించాడు. తన విషయంలో చాలా గర్వంగా ఉంది. అనీష్ హార్డ్ వర్క్, క్రమశిక్షణ, ప్యాషన్ చూస్తే చాలా ముచ్చటేసింది. తనతో చాలా కనెక్ట్ అయ్యాను. యాక్షన్ సీన్స్ కూడా తనే సొంతంగా చేశాడు. ఎక్కడా డూప్‌ను ఉపయోగించలేదు. తొలి సినిమాకే మూగవాడి పాత్ర కోసం ఎంతో ప్రిపరేషన్ అయ్యి అద్భుతంగా నటించాడు. సినిమా చూసిన అందరూ సర్‌ప్రైజ్ అవుతున్నారు. తన విషయంలో చాలా గర్వంగా ఉంది. తన లైఫ్‌లో చాలా దూరం వెళ్తాడు. తనని నా చేతుల మీదుగా లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాకు పనిచేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. నాగార్జున గారికి థాంక్ యు. ఆయన గైడెన్స్ మాకు ఎంతగానో హెల్ప్ అయ్యింది. చిత్రరంగంలో జీవితాంతం గుర్తుండిపోయే విజేత మా మెగాస్టార్ చిరంజీవి గారు. నేను డైరెక్టర్ కావడానికి నన్ను ఇన్‌స్పైర్ చేసిన ఒకే ఒక్క పదం 'జై చిరంజీవ'. ఆయన నా 'ఛలో' సినిమాకు వచ్చి బ్లెస్ చేశారు. అలాగే 'భీష్మ' సినిమాను ఆయనతో కలిసి చూసే అవకాశం నాకు దక్కింది. నేను నిర్మించిన తొలి సినిమాను బ్లెస్ చేయడానికి ఆయన రావడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ సినిమా కలెక్షన్స్ రోజురోజుకీ పెరుగుతున్నాయి. తప్పకుండా మీరందరూ ఈ సినిమాను చూడండి. చాలా సర్‌ప్రైజ్ అవుతారు." డైరెక్టర్ మహేష్ ఉప్పల మాట్లాడుతూ.. "అందరికీ నమస్కారం. నాగార్జున గారికి, చిరంజీవి గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు. నన్ను ఇంతగా నమ్మిన మా నిర్మాత వెంకీ గారికి ధన్యవాదాలు. నా మొదటి సినిమాను నాగార్జున గారు ప్రజెంట్ చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నాలాంటి ఎంతోమందికి స్ఫూర్తినిచ్చిన చిరంజీవి గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు. చిరంజీవి గారు, నాగార్జున గారి లాంటి ఇద్దరు గొప్ప వ్యక్తులు నా సినిమా చూడటం మాటల్లో చెప్పలేని ఆనందాన్ని ఇస్తోంది. నాపై ఎంతో నమ్మకం పెట్టుకుని నన్ను ప్రోత్సహించారు. ఆయన నమ్మకమే అందరినీ సర్‌ప్రైజ్ అయ్యేలా చేసింది. అనీష్ థియేటర్లలో అందరినీ సర్‌ప్రైజ్ చేశాడు. తను భవిష్యత్తులో మరెన్నో అద్భుతమైన సినిమాలు చేస్తాడు. మా టీమ్‌లోని ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు.

ఘనంగా "వ్యూ" సినిమా ప్రీ రిలీజ్



పూజా రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన సినిమా "వ్యూ". ఈ సినిమాకు ది పాయింట్ ఆఫ్ వ్యూ అనేది ట్యాగ్ లైన్. ఈ సినిమాలో ప్రదీప్, సోనియా ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని మాస్టర్ కార్తికేయ సమర్పణలో పరవాణి చలనచిత్ర, ప్రచుర కాంటెంట్ అగ్రిగేటర్స్ బ్యానర్స్ పై సత్య చౌదరి నిర్మిస్తున్నారు. మహేశ్ కాంపెల్లి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను ఈ నెల 20న శ్రీ లక్ష్మి పిక్చర్స్ ద్వారా బాపిరాజు గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తున్నారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ లో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటి సోనియా మాట్లాడుతూ - మా మూవీ ట్రైలర్ మీకు నచ్చిందని ఆశిస్తున్నాను. నేను ఎన్నో ఆడిషన్స్ కు వెళ్లాను. మంచి అవకాశం కోసం చూస్తున్న టైమ్ లో "వ్యూ" సినిమాలో ఆఫర్ దక్కింది. ఈ చిత్రంలో నటించే అవకాశం కల్పించిన మా డైరెక్టర్, ప్రొడ్యూసర్ కు థ్యాంక్స్. ఒక మంచి క్యారెక్టర్ లో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటానని నమ్ముతున్నా. చిత్ర పరిశ్రమలో కెరీర్ ఎంచుకునేందుకు నన్ను ఎంకరేజ్ చేసిన మా పేరెంట్స్ కు థ్యాంక్స్. మా వ్యూ మూవీని ప్రతి ఒక్కరూ చూసి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నా. అన్నారు. యాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ - "వ్యూ" సినిమా నాకు ఫస్ట్ మూవీ. ఈ చిత్రంలో నటించే క్రమంలో డైరెక్టర్ మహేశ్ గారు చాలా ఫ్రీడమ్ ఇచ్చారు. ఆయన సపోర్ట్ తో నా క్యారెక్టర్ ను బాగా పర్ ఫార్మ్ చేశానని నమ్ముతున్నాను. కొత్త తరహా కంటెంట్ తో మిమ్మల్ని ఆద్యంతం ఆకట్టుకునేలా మా సినిమా ఉండబోతోంది. ఈ నెల 20న థియేటర్స్ కు వెళ్లి మా సినిమా చూడాలని కోరుతున్నా. అన్నారు. హీరోయిన్ పూజా రెడ్డి మాట్లాడుతూ - "వ్యూ" సినిమాలో నటించే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నా. ఇది లేడీ ఓరియెంటెడ్ మూవీ. ఇలాంటి స్ట్రాంగ్ రోల్ నాకు కెరీర్ ప్రారంభంలోనే దక్కడం సంతోషంగా ఉంది. ఈ క్యారెక్టర్ లో నేను పర్ ఫార్మ్ చేయగలను అని నమ్మి అవకాశం ఇచ్చిన మా డైరెక్టర్, ప్రొడ్యూసర్ కు థ్యాంక్స్ చెబుతున్నా. ట్రైలర్ లో ఎంత ఎనర్జీ ఉందో మీరు చూశారు. సినిమాలోనూ అంతే ఎనర్జీ ఉంటుంది. మా మూవీ సక్సెస్ మీట్ లో మరింత మాట్లాడుతాను. అన్నారు. ప్రొడ్యూసర్ సత్య చౌదరి మాట్లాడుతూ - నేను ఈ సినిమా చేసి ప్రొడ్యూసర్ గా మీ ముందు ఉన్నానంటే కారణం మా డైరెక్టర్ మహేశ్. ప్రతి క్రాఫ్ట్ ను ఆయనే దగ్గరుండి చూసుకుంటా మంచి సినిమా చేశాడు. మా బాపిరాజు గారు సినిమాను రిలీజ్ చేసేందుకు రావడం సంతోషంగా ఉంది. శ్రీ లక్ష్మీ పిక్చర్స్, ప్రచుర కంటెంట్ అగ్రిగేటర్స్ బ్యానర్స్ నాకు సపోర్ట్ గా నిలిచాయి. నన్ను ఆదరించింది కళామతల్లి. ఆ తల్లి ఆదరణకు కృతజ్ఞతగా ఒక మంచి ఫీమేల్ ఓరియెంటెడ్ మూవీ చేశాను. మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నా. మీ ఫ్యామిలీతో కలిసి మా సినిమాను చూడండి. అన్నారు. డిస్ట్రిబ్యూటర్ బాపిరాజు మాట్లాడుతూ - ఈ ఏడాది తెలుగు చిత్ర పరిశ్రమకు విజయవంతంగా కొనసాగుతోంది. చాలా సినిమాలు హిట్ అవుతున్నాయి. డబ్బింగ్ చిత్రాలను కూడా ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. మంచి కంటెంట్ ఉన్న సినిమా కాబట్టే వ్యూ చిత్రాన్ని మేము రిలీజ్ చేస్తున్నాం. ఈ సినిమా చూసిన వారు వందమందికి బాగుందని చెబుతారు. అంటే ఒక టికెట్ కొన్న వాళ్లు వందమందితో టికెట్ కొనేలా చెబుతారు. దర్శకుడు మహేశ్ లో దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు, దర్శకరత్న దాసరి నారాయణరావు ఇద్దరూ ఉన్న